అక్టోబర్ - 2016

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక క్రైస్తవ మాసపత్రిక

ప్రధాన సంపాదకులు :

**రెవ.డా॥ కె. జోసఫ్**

సర్క్యులేషన్ :

**సామ్రాట్ కొడవటికంటి**

**చందా వివరములు :**

సంవత్సర చందా రూ. 150/-
పోషక చందా రూ. 1000/-
జీవిత చందా రూ. 3000/-
విడి ప్రతి రూ. 15/-


**మా చిరునామా :**
ఎడిటర్, పరిశుద్ధత
పోస్ట్‌బాక్స్ నెం. 28
ఒంగోలు - 523001
ఫోన్ : 08592-231281
సెల్ : 9704255416


## లోపలి పేజీల్లో...


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| బర్నబా | కొడవటికంటి | 03 |
| లియో టాల్‌స్టాయ్ | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 05 |
| చీకటి శక్తుల నుండి విడుదల | మొహిద్దీన్ భాషా సాక్ష్యము | 07 |
| బైబిలు ప్రాముఖ్యత | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 09 |
| ఉత్సాహముగా ఇచ్చుట | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 11 |
| ఏడు సంఘాలు - తుయతైర సంఘము | బ్రదర్ కె. సామ్రాట్‌గారు | 13 |
| యోబు భార్య | శ్రీమతి రేచల్ జోసఫ్ | 15 |
| బాంబులు పట్టిన చేతిలో బైబిల్ | మైఖేల్ విజయకుమార్ సాక్ష్యము | 16 |
| లోకంతీరు | ఇమ్మానియేలు రాజేంద్ర | 18 |
| బైబిల్ కథలు | మామయ్య కథలు రెవ.డా॥కె.జోసఫ్‌గారు | 20 |
| అక్షరయజ్ఞం - బైబిల్ క్విజ్ | శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు | 24 |


India Evangelistic & Relief Fellowship

| EVANGELISM | RELIEF |
|---|---|
| Church Planting | Orphanage |
| Evangelistic, Crusades | Child Development Centers |
| Pastor's Seminars | Education (U.C.L.I. Schools) |
| Youth Ministry | Widows & Lepers Care |
| T.V.Ministry | Medical Assistance |
| Magazine Ministry | Help in Natural Calamity |
| Audio Ministry | Flood Relief |
| Jail & Prison Ministry | Mobile Medical Ministry |
| IERF International Ministry | Children Care Ministry |
| Hanna Women Ministries | |


**ప్రకటన రేట్లు**

| | | |
|---|---|---|
| టైటిల్ 4వ పేజీ | ..... | రూ. 3,000/- |
| టైటిల్ 3వ పేజీ | ..... | రూ. 2,000/- |
| లోపలి పేజీ | ..... | రూ. 1,000/- |

# సంపాదకీయం.....



ప్రియ పరిశుద్ధత పాఠకులకు ప్రభువు నామమున శుభాభివందనములు.

గత నెల పత్రిక ద్వారా మేము పంపిన మనియార్డరు ఫారములను ఉపయోగించుకొని చందా పంపించిన వారికి కృతజ్ఞతలు తెలియజేయుచున్నాను. అయితే 500 మందికి మనియార్డరు ఫారాలు పంపిస్తే కనీసం పదిమంది కూడా వాటిని ఉపయోగించుకోలేకపోవడం శోచనీయం. కొంతమంది బ్యాంక్ అకౌంట్ ద్వారా చందా పంపించారు. పత్రిక కోరుతున్న వారిలో చందా కట్టడానికి సిద్ధంగా ఉన్నవారు అనేకమంది ఉన్నారు. కాని వారికి పంపలేకపోతున్నాము. పాతవారికి ఉన్నపళంగా పత్రిక ఆపటం మాకు ఇష్టంలేదు. అందువలన మనియార్డరు ఫారము అందుకున్నవారు మీ చందాను డిసెంబరులోగా పంపించగలరని ఆశిస్తున్నాము. ఒకవేళ మీరు డిసెంబర్‌లోగా చందా పంపలేకపోతే, జనవరి-2017 నుండి వరుసక్రమంలో పత్రిక ఆపివేయ బడుతుందని తెలియజేయుటకు చింతిస్తున్నాను. కావున మీ సంవత్సర చందాను వెంటనే పంపించగలరని ఆశిస్తున్నాను. మీరు బ్యాంక్ అకౌంట్ ద్వారా ఆన్‌లైన్‌లో మనీ ట్రాన్స్‌ఫర్ చేయదలచినట్లయితే మా అకౌంట్ నంబర్‌కి ట్రాన్స్‌ఫర్ చెయ్యండి. K. Joseph, Current A/c No. 13510200000175, Federal Bank, Ongole, IFSC Code FDRL0001351. మీరు ఆన్‌లైన్‌లో మనీ ట్రాన్స్‌ఫర్ చేసినట్లయితే దయచేసి మాకు 9704255416 నంబర్‌కి ఫోన్ చేసి చెప్పండి లేదా 9440217726 కి మీ పేరు, పత్రిక అడ్రస్ లేబుల్ మీద మీ సీరియల్ నంబర్, ట్రాన్స్‌ఫర్ చేసిన మొత్తం SMS చెయ్యండి. చందాదారుల వివరాలను పత్రికా ముఖంగా ప్రచురిస్తున్నాము. ఒకవేళ మీరు చందా కట్టినప్పటికీ మీ పేరు చందాదారుల లిస్టులో లేనట్లయితే వెంటనే మాకు తెలియజేయండి. గత నెలలో బైబిల్ క్విజ్-22కి 30 మంది జవాబులు పంపించారు. ప్రకటించిన విధంగా వారందరికీ 'పరలోకము-నరకము' అను పుస్తకమును పోస్ట్‌ద్వారా పంపించాము. ఎవరికైనా అందకపోయినట్లయితే మాకు ఫోన్ చేయండి. దేవుడు మిమ్మును సదాకాలము దీవించును గాక! ఆమెన్!

-ఎడిటర్

సీరియల్

# బర్నబా

**(అపొస్తలుడు రెండవభాగం)**

**5**

**– కొడవటికంటి**

తూర్పు సముద్రంలో నుండి సూర్యుడు ఎర్రని గోళం లాగా ఒక్కసారిగా పైకి వచ్చాడు. ఎంత అందమైన దృశ్యం. సిసారియా పట్టణం నుండి పడమటి దిక్కున అస్తమిస్తున్న సూర్యుని మాత్రమే చూడగలం. ఇప్పుడు తాము దిగనున్న సాలమీ రేవు నుండి రాజధాని పాఫోస్ వరకు ఈ దేశం పొడవు వంద మైళ్ళు మాత్రమే. సాలమీలో ఓడ దిగిన తర్వాత అక్కడ ఉన్న సమాజమందిరమునకు ముగ్గురు వెళ్ళారు.

తెల్లవారుతూనే బర్నబా సౌలును, మార్కును వెంట బెట్టుకొని సౌలమి నుండి దక్షిణముగా సాగిన ఉత్తర కనుమల మీదకు వెళ్ళారు. కుప్ర ఇంత అందంగా ఉంటుందని సౌలు ఇంతకు ముందు అనుకోలేదు. అటు పెద్దది కాని, ఇటు చిన్నది కాని కాదు. నేలమీద సీలలతో బిగించిన జింక చర్మంవలె ఉంది ఆ ఆకారం. తోకభాగం తూర్పుగా సముద్రాగ్రమము చొచ్చుకొని ఉంటుంది. ఓడ తెరచాప కొయ్యలు ఎలాగో ద్వీపమున పర్వతాలు, కొండలు అలాంటివి. ఎత్తైన ప్రతి కొండ మీద నుండి కుప్ర యొక్క అందం నలుదిక్కుల సముద్రంలో కనిపిస్తుంది. అదే సమయానికి ఇద్దరు యువకులు కొండ ఎక్కి పైకి రావడం చూశారు. వారిని చూస్తూనే బర్నబా ముఖం విప్పారింది. అరిస్టోబులస్ అనే మాట పెదవుల నుండి బయటకు వచ్చింది. సౌలు వైపు తిరిగి సౌలు వైపు తరిగి...

“నా తమ్ముడు అరిస్టోబులస్, ప్రభువునందు మంచి విశ్వాసి” అంటూనే పైకి ఎక్కి వచ్చిన వారికి సౌలును పరిచయం చేశాడు.

“ఇప్పుడు ఏమి చేస్తున్నారు?” అన్నాడు సౌలు.

“పరిచర్య, రోమీయులు క్రొత్తగా జయించిన బ్రిటాని యాకి వెళ్ళి వాక్యం ప్రకటించాలని అభిలాష కలిగి యున్నాను” అన్నాడు అరిస్టోబులస్.

సౌలు అతని వైపు ప్రేమగా చూసి భుజం మీద చేయి వేసి ప్రేమగా నిమిరాడు.

“రాత్రి మీరు అక్కడ సమాజమందిరంలో బోధించా రని తెలిసింది, కుప్రలో ఎంతకాలముంటారు” అడిగాడు అరిస్టోబులస్.

“పదిరోజులు మాత్రమే” చెప్పాడు బర్నబా.

“అయితే ఈ రాత్రి సిటియంలో, రేపు టమోన్సస్ సమాజ మందిరంలో టిమోన్సోస్‌లో రెండు సమాజమంది రాలు ఉన్నవి, అక్కడ యూదుల సంఖ్య మిన్న. అగస్టస్ చక్రవర్తి ఈ దేశంలోని రాగి గనులన్ని మహా హేరోదుకు అద్దెకిచ్చినప్పుడు టమోన్సస్ పట్టణంలో విపరీతమైన రాగి దొరికినందువలన వ్యాపారస్థులైన, ధనవంతులు యూదులు ఇక్కడ నివశించారు...

“ఈ రాగి వలననేనా ఈ దేశానికి కుప్ర అనే పేరు వచ్చింది?” అన్నాడు.

“నిజంగా అనాదిగా ఈ రాగిని ‘సిప్రియమ్’ అని పిలిచేవారు. అది కొంతకాలానికి సైపుస్ అయింది. తర్వాత మారి నేడు కుప్రగా మారింది” అన్నాడు బర్నబా.

అరిస్టోబులస్ వారిని ఇంకొంచెం పైకి తీసికొని వెళ్ళినప్పుడు ఉత్తరాన దూరంగా తార్సు పట్టణపు సరిహద్దు తారిస్ పర్వతాలు కనిపించాయి.

మూడవ రోజున కరిదాత పట్టణానికి వచ్చారు. రాగి గనులు చూచారు. అక్కడ నుండి కొంచెం దూరం నడచి సమాజమందిరంలో ప్రవేశించారు. మాస్సోను అనే విశ్వాసి బర్నబాను గట్టిగా కౌగిలించుకొని కుశల ప్రశ్నలు అడిగిన తర్వాత సౌలుకు పరిచయం చేయబడ్డాడు. మాస్సోను కుటుంబ సమేతంగా యెరూషలేములో నివశించుటకు సిద్ధపడియున్నాడు అని సౌలుతో చెప్పాడు బర్నబా. మరు నాడు ‘ట్రూడోస్’ పర్వతం వద్దకు వచ్చారు. అక్కడ ఉన్న

యూదుల సమాజమందిరంలో ప్రవేశించారు. ఎదురుగా నిర్మలమైన ఆకాశంలోకి దూసుకొని వెళ్ళిన టూడ్రోస్ శిఖరం గంభీరంగా కనిపిస్తుంది. బర్నబా సౌలు ప్రక్కనే కూర్చుని...

"పూర్వం ఈ పర్వతాన్ని ఒలంపస్ అని పిలిచేవారు. దేవతలు, దేవుళ్ళు ఈ పర్వత శిఖరం మీద నివశిస్తారని ప్రతీక. అదీకాక మరకతమణి అనే రాయి ఇక్కడే లభ్య మవుతుంది" అన్నాడు.

"ప్రధాన యాజకుని న్యాయ విధాన పతకంలో రెండవ వరసలో ఉండే మొదటి రాయి మరకతమే కదా!" అన్నాడు సౌలు.

"యెరూషలేము దేవాలయము వద్ద బలి అర్పణకై అమ్మబడే గొఱ్ఱెలలో ఎక్కువభాగం ఇక్కడ నుండే సరఫరా అవుతాయి. అంతేకాదు హెర్మోను పర్వతం దగ్గర ఇనుము విపరీతంగా లభ్యమైనా దావీదు మహారాజు ఇక్కడి నుండే ఇనుము దిగుమతి చేసుకొనేవాడు".

అంతలో అరిస్టోబులస్ "ఇక్కడికి దగ్గరలోనే రతిదేవి ఆలయం ఉంది. అక్కడ నుండి పది మైళ్ళ వెళితే ఈ దేశ రాజధాని 'పాపోస్' పట్టణం చేరవచ్చు" అన్నాడు.

ఆ రాత్రి సమాజమందిరంలో గడిపారు. తార్సు పట్టణానికి ఒక వైపుననే సముద్రం. కాని ఇక్కడ ఎటు తరిగినా సముద్రపు గాలులే వీస్తున్నాయి. సౌలు చల్లగాలిని పీల్చుకొన్నట్లుగా నడుస్తూ మధ్యలో అరిస్టోబులస్ చూస్తూ "బ్రిటానియాలో ఇంకా చిన్న చిన్న ద్వీపములు లెక్కలేనన్ని ఉన్నాయి కదా!" అన్నాడు. మరలా "బ్రిటానియా చాలా దూరం అది ఒక అనాగరిక జాతులు జీవించే ద్వీపముల సముదాయమని విన్నాను, అంత దూరం వెళ్ళాలని మీకు ఎందుకు అనిపించింది?. ఇప్పటికి ప్రభువు శిష్యులలో సేవార్ధమై ఖండాంతరం వెళ్ళిన వాడు తోమాగారు ఒక్కరే. ఆయన సింధూ దేశం వెళ్ళాడు" అన్నాడు.

అరిస్టోబులస్ తన అన్న బర్నబా వైపు చూచి ఆలోచనగా సౌలు వైపు తిరిగాడు. "ఇంతకాలం బ్రిటన్ ద్వీప సముదా యమును గూర్చి విన్నామే కాని దాని విషయం పూర్తిగా ఎవరికి తెలియదు. బ్రిటన్ రోమా పట్టణమునకు స్వాధీన మయిన తర్వాత, రోమా నుండి మూడు నెలలు ప్రయాణం చేసి బ్రిటానియా చేరి అక్కడ పదహారు రోజులు మాత్రమే బసచేసాడు. కాబట్టి అటువంటి ప్రదేశములలో సువార్త ప్రకటించ పంపించమని ప్రభువును ప్రార్థిస్తున్నాను" అన్నాడు.

అరిస్టోబులస్ మాటలు వినే కొలది అతని వ్యక్తిత్వము సౌలుకు గొప్పగా గోచరించింది. ఆమెన్ అని ప్రయాణం సాగించారు. వీనస్ దేవి ఆలయము పోపోస్‌కి పది మైళ్ళ దూరంలో నున్నది. అక్కడికి చేరే సరికి సాయంకాలం నాలుగు గంటలు అయింది. తిరనాళ్ళ జనంవలే కిక్కిరిసి ఉన్నారు. దేవా లయం చిన్నదే కాని దాని కిరువైపుల రెండు గొప్ప స్థంబాలు రమణీయంగా అలంకరించారు. సముద్రం ప్రక్కగా కట్ట బడిన అరుగు మీద సౌలు, బర్నబా, మార్కు, అరిస్టోబులస్ నిలబడి చూస్తుంటే, నేపేగు, అరిస్టోబులస్, అతని స్నేహి తుడు వచ్చాడు. అరిస్టోబులస్ మిగిలిన వారికి ఆయనను పరిచయం చేసాడు. మార్కు కొంచెం దూరంగా నిలబడి ఉన్నాడు. అతనికి ఈ పరసరాలు ఈ మనుష్యులు అంతా అయిష్టంగా ఉన్నవి. ఏదో తప్పిదం చేస్తున్న వానిలా ఉంది అతని ముఖం. సమాజమందిరంలో ఉన్నప్పుడు తప్పితే మరి యూదేతరులు వుండే ఏ ప్రాంతము అయిన అక్కడ బహువ్యాకులం కలిగిస్తుంది.

నెఫేగు సౌలు దగ్గరకు వెళ్ళి ఆ దేవాలయము వైపు చూపిస్తూ "ఈ దేవతను అష్టేధిక అని పిలుస్తారు. ఈమె నల్లని రాయితో చేయబడినది. ఎదురుగా ఉన్న సముద్రపు కెరటాల నురుగులో నుండి ఆమె జన్మించింది. ఎందరో మహా పరాక్రమవంతులు యుద్ధమునకు ముందు ఈమెను దర్శించి ఆమె వద్ద తమ భవిష్యత్తు చెప్పించుకుంటారు. ఈమెకు మగ పశువులను మాత్రమే బలి ఇస్తారు. చక్ర వర్తులు ఇచ్చిన దానములతో ఈమె చాలా ధనవంతురాలైన దేవత" అంటు బర్నబా వైపు తిరిగి " ఈ రాత్రి మా ఇంటి వద్ద మీకు బస ఏర్పాటు చేశాను" అంటూ అరిస్టోబులస్ వైపు చూసాడు. ఔను అన్నట్లుగా అరిస్టోబులస్ బర్నబా వైపు చూశాడు. **(సశేషం)**

సీరియల్

# ఆల్బర్ట్

## (లియో టాల్‌స్టాయ్)



ఆల్బర్ట్ వాయించిన గీతము డెలినోవ్ హృదయంలో మధురానుభూతిని కలిగించింది. అల్బర్ట్ యొక్క సంగీత నైపుణ్యం డెలినోవ్‌ను ఆవరించింది. ఆల్బర్ట్‌ను ఎలాగైనా అందరిలాగా అనుకరించాలి అనుకున్నారు. అతనిని ఇంటికి తీసుకొనిపోయి మంచి గుడ్డలు ఇచ్చి నీచస్థితి నుండి తప్పించాలి అనుకున్నాడు.

అల్బర్ట్ దగ్గరగా వచ్చి "మీరు బాగా అలసిపోయారా?" అన్నాడు. అల్బర్ట్ కొద్దిగా నవ్వి, "ఇప్పుడు నాకు ఏమైనా తాగాలని వుంది" అన్నాడు. "మీరు బాగా వాయిద్యాలు ఇంకా నేర్చుకొని బయట ప్రపంచంలో ప్రదర్శనలు ఇవ్వాలని అనుకుంటున్నాను" అన్నాడు.

డెలినోవ్ ఒక బాటిల్ వైన్ తెచ్చాడు. అల్బర్ట్ రెండు గ్లాసులు గబగబ త్రాగి తర్వాత మంచి డ్రింకు ఇది అన్నాడు. డెలినోవ్ ప్రక్కన కూర్చుంటూ మంచి డ్రింకు ఇచ్చారు కదా మీ కొరకు నేనేదైనా వాయిస్తాను అని, కొంచెం డ్రింకు ఇవ్వండి అన్నాడు.

డెలినోవ్ మరొక గ్లాసు డ్రింకు ఇచ్చి మీతో మొహ మాటం లేకుండా మాట్లాడతాను. మీరు చాలా గొప్ప విద్వాంసులు. కాని ఇప్పుడు సరైన స్థితిలో లేరని భావిస్తున్నాను అన్నాడు.

అదే సమయంలో ఆ ఇంటి యజమాని లోపలికి వచ్చాడు. నేను మీకు కొంత సహాయం చేస్తాను నాతో పాటు కొంతకాలం నా ఇంట్లో ఉండండి. నేను ఒంటరిగా ఉంటున్నాను అన్నాడు. అల్బర్ట్ నవ్వి ఊరుకున్నాడు.

నువ్వు ఆయనకు కృతజ్ఞుడవై యుండాలి అని ఇంటి యజమానురాలు అల్బర్ట్‌తో అని, డెలినోవ్ వైపు తిరిగి అడ్డంగా తల త్రిప్పింది. సరే నేను మీతో వస్తాను కాని ముందు కొంచెంసేపు వాయించనివ్వండి అన్నాడు. తర్వాత అల్బర్ట్ లేచి తన కోటు వేసుకొని డెలినోవ్‌తో కలిసి బయటకు వచ్చాడు.

డెలినోవ్ తన క్రొత్త స్నేహంతో తన గుఱ్ఱపు బగ్గీలో కూర్చున్నప్పుడు సారాయి వాసన గప్పున కొట్టింది. అదేమంత సంతోషకరమైన సంగతి కాదు. తను చేస్తున్న పని అంత మంచిది కాదు అనుకున్నాడు. అంతేకాక అల్బర్ట్ మాట్లాడే మాటలన్ని బుద్ధిలేనివే, వినదగినవి కావు. ఇతనిని నేను ఎలా మార్చగలను? అనుకున్నాడు.

అలా బండి వెళుతున్నది. అల్బర్ట్ నిద్రపోతూనే ఒరిగిపోయి బండిలో మూలగా జరిగి గురకపెట్టడం మొదలుపెట్టాడు. నిద్రపోతున్న ఆల్బర్ట్‌ను పరిశీలనగా చూశాక అతని మీద కొంత జాలి కలిగింది. తన మనసులో ఇంతకుముందు రేగిన మధురభావాలు పైకి వచ్చాయి. ఇప్పుడు ఆల్బర్ట్ విషయం చెడుగా ఆలోచించసాగారు. బండి నడుస్తుంది. బండి కిటికీలోని బయట మంచుతో చల్లబడిపోయాడు. మళ్ళీ ఆల్బర్ట్‌ను తీరికగా చూశాడు. ముఖము అందమైనదే కాని చాలా బలహీనముగా ఉన్నాడు. అలా ఆల్బర్ట్‌ను చూసే కొలది మరలా అతనికి ఏదైనా మేలు చెయ్యాలనిపించింది.

ఇంటికి చేరిన తర్వాత డెలినోవ్ తన గదిలోకి వెళ్ళి నిద్రపోయాడు. తెల్లవారి లేచి ఆఫీసులోకి వెళ్ళబోతుంటే హాలులోకి వస్తూ రాత్రి జరిగిన సంగతులన్నీ, తను ఆల్బర్ట్‌ని ఇంటికి తీసుకొని రావడం మంచిదా చెడ్డదా అని ఆలోచించే సమయం ఇది కాదు అనుకుంటూ భోజనశాలలో నుండి వస్తుంటే ఆల్బర్ట్ అక్కడ సోఫాలో మత్తుగా రాత్రి ఏ విధంగా అతనిని పండేశారో అలానే పండుకొని నిద్రపోతున్నారు. అతన్ని చూస్తే డెలినోవ్‌కి బాగుండలేదు. అక్కడ నిలుచున్న పని వానిని చూసి నీవు శ్యాంసుందర్ దగ్గరకి వెళ్ళి నాకు నాలుగు రోజులు ఒక వయొలిన్ అద్దెకు కావాలని చెప్పు అన్నాడు.

ఇతను నిద్రలేచినప్పుడు కొంచెం కాఫీ ఇచ్చి అతనికి నా లోదుస్తులు, ఇంకా ప్యాంటు చొక్కా ఇచ్చి అతను కొంచెం శుభ్రంగా ఉండేటట్లు చూడు అని చెప్పి ఆఫీసుకు వెళ్ళాడు.

రాత్రి కొంచెం ఆలస్యంగా ఇంటికి వచ్చి డెలినోవ్, ఆల్బర్ట్ అక్కడ లేకుండటం చూసి ఆశ్చర్యపోయాడు. అతడు అన్నం

తిని వెంటనే వయొలిన్ తీసుకొని ఒక గంటలో వస్తానని చెప్పి వెళ్ళాడు. కాని మళ్ళీ రాలేదు అన్నాడు పనిమనిషి. డెలినోవ్ విసుక్కున్నాడు. నువ్వు అతన్ని ఎందుకు పోనిచ్చావు? అన్నాడు.

జాకర్ ఎనిమిది సంవత్సరాల నుండి డెలినోవ్ దగ్గర పనిచేస్తున్నాడు. అతను కూడా ఒంటరివాడే. అదేమిటండి మీరు అతనికి దుస్తులు ఇమ్మన్నారు కాని అతనిని ఎక్కడికి వెళ్ళనివ్వవద్దు అని చెప్పలేదు కదా! మీరు అలా చెప్పినట్లైతే నేను పోనిచ్చేవాడిని కాదు అన్నాడు.

సరే, అతను ఇక్కడ ఏమి చేశాడు? అన్నాడు. అతను గొప్ప నటుడు అని చెప్పవచ్చు (రష్యాలో నటుడు అంటే దొంగ అని కాని, మాటలతో మాయ చేసేవాడని అంటారు). అతను కొంచెం మాడియారా త్రాగి వంట అతనితో ముచ్చట్లాడారు. నేను టీ ఇచ్చి భోజనం పెట్టాను. అతను తినలేదు కాని నన్ను తినమని బలవంతం చేశాడు. కొంచెంసేపు వయొలిన్ వాయించాడు. అలా వాయించే వారికి ఎవరైనా స్నేహితులవుతారు. అతను వాయిస్తుంటే మిగిలిన అపార్టుమెంటు వాళ్ళు కూడా వచ్చి విన్నారు.

సరే, కాని అతనికి నా గుడ్డలు ఇచ్చావా? అన్నాడు మధ్యలో డెలినోవ్.

మీ నైటీ ఇచ్చాను. అతనికి సాయం చెయ్యడం మన విధి అని నాకనిపించింది అన్నాడు జాకర్.

మీరు సంఘములో ఎంతో గొప్ప కలిగి ఉన్నారని నన్ను మాటిమాటికి అడుగుతుండేవాడు అని చెప్పాడు జాకర్.

సరే అయిందేదో అయింది. ఇక మీదట అతనికి త్రాగటానికి ఏమి ఇవ్వవద్దు. ఇక మీదట నేను అతనితో కఠినంగా ఉంటాను అన్నాడు.

అది నిజమే, ఎందుకంటే అతను బలహీనంగా ఉన్నాడు. పాత యజమాని దగ్గర ఇటువంటి గుమస్తా ఒకడు – జాకర్‌ను మాట్లాడనీయకుండా ఆ సంగతి ఆపి, నువ్వు వెళ్ళి ఆల్బరు ఎక్కడున్నాడో తీసుకురా అన్నాడు.

తర్వాత ఆల్బర్టు వచ్చి, ఇప్పుడు నేను వయొలిన్ వాయిస్తాను అన్నాడు.

జాకర్ బాటిన్ వైను, రెండు గ్లాసులు తెచ్చి పెట్టి ప్రక్కరూంలో కూర్చుని సిగిరెట్టు ముట్టించాడు.

మనం కొంచెం మాట్లాడుకుందాము అన్నాడు డెలినోవ్. వెంటనే ఆల్బర్టు వయొలిన్ ప్రక్కన పెట్టి నవ్వుతూ కూర్చున్న వెంటనే తన చేతితో తల వెంట్రుకలు సరిచేసుకుంటూ, రాత్రి మీ ప్రక్కన కూర్చున్న వ్యక్తిని మీరు యన్ అని పిలిచారు. అతను ఇంతకుముందు గొప్ప పేరు ప్రఖ్యాతులు కలిగిన యన్ కుమారుడా? అన్నాడు.

ఔను యన్ సొంతకుమారుడు అన్నాడు డెలినోవ్.

ఔను అతని వాలకము చూసి నేను ఇతను చాలా గొప్ప వ్యక్తి అనుకున్నాను. అతను బాగా డ్యాన్సు చేశాడు అన్నాడు.

నువ్వు ఎవరికి గురించి మాట్లాడుతున్నావు? అన్నాడు డెలినోవ్. అదే డాన్సు చేస్తూ నా మీద పడిన అతని గురించి అన్నాడు ఆల్బర్ట్.

అబ్బే అతను నువ్వనుకున్నంత గొప్ప వ్యక్తి కాదు అన్నాడు. కాని అతను మంచి వాద్యగాడేమో అన్నాడు ఆల్బర్టు.

అతను వాద్యగాడే కాని శాస్త్రీయ సంగీతము తెలియదు అన్నాడు. తరువాత వాళ్ళిద్దరు గొప్ప వాయిద్యగాండ్లను గురించి, కవుల గురించి చాలాసేపు మట్లాడుకున్నారు. ఆల్బర్టు వయొలిన్ తీసుకొని మంచి శృతులు రెండు వాయించి, వయొలిన్ ప్రక్కనపెట్టి, ఇక వాయించాలంటే అని ఓ గ్లాసునిండా మద్యము త్రాగి డెలినోవ్ బెడ్‌మీద కూర్చున్నాడు.

నీవెప్పుడైనా ప్రేమలో పడ్డావా అని అడిగాడు డెలినోవ్. ఆల్బర్టు కొంచెంసేపు డెలినోవ్ ముఖంలోకి చూసి ఆ ప్రశ్న ఎందుకు అడిగావు అని అతని కళ్ళలోకి చూస్తూ, నేను నీకు అంతా చెబుతాను. నేను నిన్ను మోసం చెయ్యను కాని మొదటి నుండి అంతా చెబుతాను అన్నాడు ఆల్బర్టు. అన్నాఇవానోవ్నా మీకు అంతా చెప్పియుండాలి. నేను పిచ్చివాడినని ఆమె అందరికీ చెబుతుంది. ఆ మాట ఒఖ సరదా పదంలా చెబుతుంది. నిజం ఆమె చాలా మంచిది. నేను కొంతకాలం క్రితం బాగాలేను. కొంచెం ఆగి డెలినోవ్ కళ్ళలోకి చూస్తూ నేనెప్పుడైనా ప్రేమలో పడ్డానా? అని అడిగాడు. నిజమే నేను ప్రేమలో పడ్డాను. నేను ఒపెరాలో రెండవ వయొలిన్ మాస్టర్‌గా పనిచేసేటప్పుడు ఆమె స్టేజి ప్రక్కన ఉన్న ప్రేక్షకుల గదిలో కూర్చునేది. **(సశేషం)**

సాక్ష్యము

# చీకటి శక్తుల నుండి విడుదల

నా పేరు మొహిద్దీన్ బాషా. గుంటూరు జిల్లా అచ్చంపేట మండలంలోని ఊటుకూరు నా స్వగ్రామం. 1988 లో తెనాలి ఆర్.టి.సి. డిపోలో డ్రైవర్‌గా నాకు ఉద్యోగం వచ్చింది. 1991 లో సత్తెనపల్లి డిపోకు మార్చబడ్డాను. సత్తెనపల్లి రాజులకాలనీలో ఇల్లు కట్టుకొని నివాసం కొనసాగిస్తున్నాను. నేను మూర్ఖ స్వభావం గలవాడిని. బహు కోపిష్టిని. ఇరుగు పొరుగు వారితో సమాధానంగా ఉండేవాడిని కాను. నాగులుమీరా పుట్టకు, దర్గాకు కుటుంబ సమేతంగా వెళ్ళి పూజలు చేసేవారము. నమాజుకు వెళ్ళేవాడను కాను. మా వీధిలోనే నివాస ముంటూ మైకు ద్వారా ప్రార్థన జరిగిస్తున్న అమీర్‌జాన్ గారిని, వారి భార్యను, నేనూ, నా భార్య ఎంత గానో అపహసించి మాట్లాడేవాళ్ళం. అప్పట్లో వారు సత్తెనపల్లి డిపోలో కండక్టరుగా పని చేస్తున్నారు.

ఇలా జరిగిపోతున్న కాలంలో మా ఇంట్లో ఒళ్ళు కాల్చుకున్న మనిషిలాగా ఒక రూపాన్ని చూసేవాడను. ఆ రూపాన్ని ప్రత్యక్షంగా నా కళ్ళతో చూచి చాలా భయపడేవాడను. అది కనబడకుండా ఉండాలని ఇంటికి తాయత్తులు, నిమ్మ కాయలు, దారాలు ఎన్నో కట్టించాను కాని ఫలితం లేదు. మాంత్రికులు చేప్పేవన్ని చేశాను ఫలితం శూన్యం. 2000 జనవరి 16న సత్తెనపల్లి నుండి గుంటూరుకు నేను సర్వీసు చేయుచుండగా సాయంత్రం 6:30 ని॥లకు నాకు అర్థం కాని రీతిలో ఆకస్మాత్తుగా ఒక వ్యక్తి (మిర్చియార్డులో పనిచేసే కార్మికుడు) నా బస్ క్రిందపడి చనిపోయాడు. పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి జరిగిన సంగతి తెలియజేసి బస్సును అక్కడపెట్టి ఇంటికి వచ్చి పడుకున్నాను. ఆ చీకటి శక్తి మీసాలు దువ్వుతూ నాకు మరలా కనిపించాడు. ఆ తర్వాత రోజు దర్శనం కలిగింది. ఒక టేబుల్ మీద ఒక ఫైల్ కనపడింది. దాని మీద ఒక చేయి తెల్లని కాగితంపై ఎర్రని అక్షరాలు వ్రాస్తున్నట్లు కనిపించింది. ఈ దర్శనం కలిగిన వారం రోజులలోపే నేను ఉద్యోగం నుండి సస్పెండ్ చేయబడ్డాను. ఆ తర్వాత ఉద్యోగం నుండి కూడా తొలగించబడ్డాను. జీవితం దుర్భరంగా మారి పోయింది. అప్పులు చేసి వేలరూపాయలు మాంత్రికులకు ఖర్చు చేసినా ఫలితం లేదు. ఒకనాడు మక్కెన గ్రామం నుంచి ఒక మాంత్రికుని పిలిపించాను. అతడు ఒక కొత్త కుండను తెప్పించి కొత్త టవల్, పూలు వగైరా అందులో పెట్టి మా ఇంటి మెట్ల క్రింద గుంత తీయించి నా చేత పాతి పెట్టించాడు. ఆ రోజు నుంచి ఆ చీకటి శక్తి నాలో ప్రవేశించింది. తలలో ముళ్ళు గుచ్చుకుంటున్నట్లు బాధ కలుగుతున్నది. అన్నంతిన్న తర్వాత కడుపులో గడబిడా శబ్దాలు ప్రారంభ మయ్యేవి. తిన్న ఆహారమంతా ఆ శక్తి తినివేసేది. కుటుంబ పోషణ కష్టమైపోయింది. ఇల్లు అమ్ముకునే పరిస్థితులు వచ్చాయి. నా బంధువులు చాలామంది నా యొద్దకు వచ్చి నన్ను చూచి భయపడి వెంటనే వెళ్ళిపోయే వారు. వచ్చి చూడడం తప్ప మరెలాంటి సహాయం వారు చేయలేదు.

మా పెద్దనాన్న కుమారుడు షేక్ మాబు సుభాని నన్ను శ్రీకాకుళంలోని మాంత్రికుని యొద్దకు తీసుకువెళ్ళాడు. అక్కడ కూడా నా బాధలు ఎక్కువైపోయాయి తప్ప ఫలితం కనిపించ లేదు. ఒళ్ళంతా మంటలు పుట్టాయి. మూలికల కషాయం కూడా త్రాపించారు. దాని వల్ల ఇంకా నీరసపడి పోయి చిక్కి శల్యమై పోయాను. ఇక ఆశలు వదులుకొని ఇంటికి చేరాను. ఆ మాంత్రికుడు నా ఇంటిలో ఉన్న కుండను గూర్చి మాట్లాడుతూ అది తీసివేస్తే వెంటనే చనిపోతావు, లేకపోతే పిచ్చివాడవైపోతావు. తీసి వేయకపోతే క్రమక్రమంగా చచ్చి పోతావు అన్నాడు. నేను ఇంటికి వచ్చి జీవితంపై ఆశలు వదులుకున్నాను. నా భార్యాబిడ్డలు అందరం ఏడ్వటం ప్రారంభించాము.

ఇది జరగకముందు అనగా ఉద్యోగం పోయినప్పుడు గుంటూరు సి.టి.యం.గార్కి అప్పీలు పెట్టుకున్నాను. అప్పుడు మరల నాకు దర్శనం కలిగింది. ఆ దర్శనం కూడా మొదటి దర్శనమును పోలినదే. ఒక టేబులు, దాని మీద ఫైలు, ఒక

చేయి తెల్ల కాగితంపై ఎర్రని అక్షరాలు కనిపించాయి. అప్పీలు తిరస్కరించబడినది. మరలా ఆర్.యం.గారికి అప్పీలు పెట్టుకున్నాను.

ఇలా జరుగుతున్న కాలంలో మా ఇంటికి సమీపమున ఉన్న ఒక సహోదరి తామాసమ్మ(దేవి) ఆదివారం రోజున నన్ను మా వీధిలోని ప్రార్ధనా మందిరమునకు తీసుకొని వెళ్ళినది. పాస్టర్ విల్సన్‌గారు వారి సతీమణి మొట్టమొదట నా కొరకు ప్రార్ధన చేశారు. ఆ తర్వాత మా ఇంటికి సమీపాన ఉన్న ఎ. సుబ్బారావు కండక్టర్‌గారు అయ్యన్నగారు, నన్ను సహోదరి జయమ్మ గారికి పరిచయం చేశారు. వారంతా చుట్టు మూగి ప్రార్ధన చేశారు. క్రైస్తవ సహోదరుల ప్రేమను ఆ సమయంలో తెలుసుకున్నాను. వారు నా కోసం ఉపవాసా లుండి కన్నీటితో ప్రార్ధించారు. నాలో నుండి నాలుగు శక్తులు బయటికిపోవడం నాకు అర్ధమైనది. ఫుల్‌గాస్పెల్ చర్చి పాస్టర్ సుధీర్‌కుమార్‌గారు విశ్వాసులు నా కొరకు ఎంతగానో ప్రార్ధించారు. యేడు నక్షత్రములు పత్రిక ఎడిటర్‌గారు సత్తెనపల్లిలో హోలీనైట్ కార్యక్రమం నిర్వహిస్తుండగా అక్కడకు వెళ్ళి నా పరిస్థితి చెప్పి ప్రార్ధన చేయించుకున్నాను. వారు కూడా నా నిమిత్తం ఎంతగానో ప్రార్ధించారు.

ఒకరోజు నాగార్జుననగర్ ఫుల్‌గాస్పెల్ చర్చిలో నేను ప్రార్ధనలో ఉండగా మరొక దర్శనం చూశాను. ఒక టేబుల్ మీద ఫైల్ ఉన్నది. ఏదో వ్రాయబోవుచుండగా చేతిలోని పెన్ను క్రింద పడిపోవడం, ఆ చేయి వంకర తిరిగిపోయి పిచ్చిగోళ్ళు మొలచి వికారంగా మారిపోవడం జరిగింది. మరికొన్ని రోజుల తర్వాత మరొక దర్శనం చూశాను. ఒక పెద్ద అరుగుపైన ఒక చెక్క కుర్చి అందులో తెల్లని వస్త్రములు ధరించిన వ్యక్తి ఉన్నాడు. నేను వెళ్ళి చేతులు కట్టుకొని ఆయన వద్ద నిలుచున్నాను. ఆయన ఒక మనిషిని పిలిచి నా వైపు చూపించాడు. ఆయన నన్ను గదిలోనికి తీసుకువెళ్ళి ఒక కాగితం నా చేతికిచ్చాడు. తెల్లవారిన తర్వాత ఆ దర్శనం గురించి సహోదరులందరికి తెలియపర్చగా వారు నీకు దేవుడు మరలా ఉద్యోగం ఇప్పించాడు. ధైర్యముగా ఆఫీసుకు వెళ్ళమని చెప్పారు. వారివద్ద ప్రార్ధన చేయించుకొని గుంటూరు ఆర్.యం.గారి ఆఫీసుకు వెళ్ళాను. వెంటనే నాకు దర్శనంలో స్పష్టంగా కనిపించిన వ్యక్తి అక్కడ నన్ను చేర్చుకొని ఉద్యోగం ఆర్డరు కాపీని నాకిచ్చి మాచర్ల వెళ్ళి డ్యూటిలో జాయిన్‌కమ్మని చెప్పడం జరిగింది. ప్రభువు ఎంత ఆశ్చర్యకరుడో వర్ణించ లేను. మాచర్ల వెళ్ళి 2001 మార్చి 7న తిరిగి ఉద్యోగంలో చేరాను. ఇది జరగక ముందున ఉద్యోగం కోసం రాజకీయ నాయకులనెందరినో ఆశ్రయించి విఫలుడయ్యాను. 2001 అక్టోబర్ 17న నాపై పెట్టిన క్రిమినల్ కేసు కూడా గుంటూరు కోర్టులో కొట్టి వేయబడినది. నాకు కలిగిన మరి ఒక దర్శనమునుబట్టి ఇంటిలో పాతిపెట్టియున్న కుండను కూడా తీసిపారవేశాను. ప్రభువు కృపనుబట్టి క్రమక్రమంగా నాకు పూర్తి ఆరోగ్యం చేకూరినది. మాచర్లలోని క్రైస్తవ సహోదరుల సహవాసంలో విశ్వాసంలో బలపడి బాప్తిస్మం కూడా తీసు కున్నాను. ఫుల్‌గాస్పెల్ చర్చి వ్యవస్థాపకులు అబ్రాహాము సుధాకర్‌గారు కూడా నా నిమిత్తం ప్రార్ధించారు. శ్రావణ్ పాస్టరుగారు మాచర్లలోని దేవదాసు పాస్టర్‌గారు ఇర్మియా పాస్టర్ గారు, ఐ.జేమ్స్ పాస్టర్ గారు, రాజుగారు, క్రిష్టోఫర్ గారు నా నిమిత్తమై ఎంతగానో ప్రార్ధించారు. సహోదరి మేరి(దుర్గ) అను దైవజనురాలు ఆమెతో కూడ ఉన్న విశ్వాసులు కూడ నా కోసం ఎంతో ప్రార్ధన చేసియున్నారు.


నా పేరు బర్నబా ప్రభుదాస్ కుమార్‌గా మార్చబడినది. ఆర్ధిక సమస్యల నుండి విడుదల పొందాను. ప్రస్తుతం నా ఉద్యోగం చేసుకుంటూ సమాధానంగా జీవిస్తున్నాను. ఆయా ప్రాంతాలు తిరిగి నన్ను చీకటి శక్తుల నుండి విడిపించిన ప్రభువు నామమును గూర్చి అనేక చోట్ల సాక్ష్యమిస్తున్నాను. దేవుడు నాకు గాన పరిచర్యను కూడా ఇచ్చాడు. ప్రభు ప్రేమనుగాని, ఆయన బిడ్డల ప్రేమనుగాని ఎన్నటికిని మరచువాడను కాను. జీవిత పర్యంతం ఆయన సాక్షిగా జీవించే కృప నాకు చాలునని దేవుని ప్రార్ధిస్తున్నాను. మీ అందరు నా గురించి నా కుటుంబమును గురించి ప్రార్ధించా లని కోరుకుంటున్నాను. ప్రభువు నామమున అనేకులు చీకటి శక్తుల నుండి విడిపించబడాలని నా ఆకాంక్ష.

ప్రభుకృప మనందరికి తోడైయుండునుగాక

ఇట్లు మీ ఆత్మీయ సహోదరుడు

షేక్ మొహిద్దీన్ బాషా, సత్తెనపల్లి.

4



# బైబిలు ప్రాముఖ్యత

**(Importance of the Bible)**

**సేకరణ: రెవ.డా॥ కె.జోసఫ్**

టెలిస్కోపు కనిపెట్టబడకముందు కొన్ని వందల, వేల నక్షత్రాలు అనుకొనేవారు. అయితే ఈ మధ్య కాలము లోనే కొన్ని వందల లక్షల నక్షత్రాలున్నాయని, ఆ తర్వాత లెక్కపెట్టలేనన్ని కోట్ల కోట్ల నక్షత్రాలున్నాయని చెప్తున్నారు. అయితే ఆదికాండము 15:5వ వచనములో యెహోవా దేవుడు అబ్రహాముతో ***"నక్షత్రములను లెక్కించుటకు నీచేతనైతే లెక్కించుము అని చెప్పి, నీ సంతానము అలాగవునని చెప్పెను".*** యిర్మియా 33:22లో యెహోవా యిర్మియాకు ప్రత్యక్షమై "ఆకాశ నక్షత్రములను లెక్కింప శక్యము కానట్టుగాను, సముద్రపు ఇసుక రేణువుల నెంచుట అసాధ్యమైనట్టుగాను..." మనం చూస్తాము.

చాలాకాలం క్రితం వరకు విజ్ఞాన ప్రపంచమునకు నక్షత్రములు లెక్కకు మించినవని అవి కొన్ని వందల వేల గెలాక్సీలలో వందల వేలకు మించినవని తెలియదు. అయితే పరిశుద్ధ గ్రంథమునకు తెలుసు ఎందుకంటే దాని కర్త యెహోవా దేవుడు కనుక. యోబు 38,39 అధ్యాయాలలో యెహోవా దేవుడు యోబును అనేక ప్రశ్నలడుగుచు వాటిలో విద్యుత్ తరంగ ములను గూర్చి మాట్లాడుచున్నాడు. రేడియోను గురించి యోబుకు తెలియదు అయితే యెహోవా దేవుడు "మెరుపులు బయలు వెళ్ళి.... చిత్తము ఉన్నామని నీతో చెప్పునట్లు నీవు వాటిని బయటకు రప్పింపగలవా? అని రేడియో తరంగములను గూర్చి మాట్లాడినట్లు బైబిల్‌లో లిఖించబడినది.

భూమిలో ప్రతి వంద అడుగుల లోతుకి ఒక డిగ్రీ వేడి పెరుగుతుంది. ఈ మధ్యకాలములో విజ్ఞానశాస్త్రము 50 మైళ్ళ లోతు తర్వాత తట్టుకోలేని వేడి పుడుతుంది అని చెపుతుంది. అయితే పరిశుద్ధ గ్రంథములో ***"భూమి నుండి ఆహారము పుట్టును. దాని లోపలి భాగము అగ్నిమయమైనట్లుండును"*** (యోబు 28:5) అని వ్రాయ బడినది. అంత్యదినములలో ఇద్దరు దైవసాక్షులను జయిం చిన అంత్యక్రీస్తు తన జయ చిహ్నముగా మూడు దినము లున్నర ఆ ఇద్దరి శవములను సమాధి చేయక సంత వీధులలో పడవేయగా ప్రజలకును, వంశములకును, ఆయా భాషలు మాటలాడు వారికిని, జనములకును సంబధించిన వారు ఆ మూడు దినములున్నర వారి శవములను చూచుచూ, అంటే భూనివాసులందరు చూస్తారని ఎలా? ఉపగ్రహముల ద్వారా, టి.విలలో చూస్తారని టెలివిజన్ యొక్క ఆవిర్భావాన్ని ముందుగానే ప్రవచింపబడినది.

ఇంతవరకు మనము చరిత్ర, విజ్ఞానశాస్త్రములు వేద వాక్యము నిజమైనదిగా, నమ్మదగినదిగా చెప్పుట గమనించి యున్నాము. ఇంకా, నెరవేరిన ప్రవచనములు బైబిలును సత్యవేదముగా నిరూపించుట చూద్దాం. దానియేలు గ్రంథము 2వ అధ్యాయములో కల్దీయుల రాజగు నెబుకద్నె జరునకు కలిగిన స్వప్నమును గమనిస్తే అందు ఒక బ్రహ్మాండమైన ప్రతిమ మహా ప్రకాశమును భయంకరమైన రూపమును గలదై కనిపించెను. దాని శిరస్సు మేలిమి బంగారు మయమైయుండెను. ఇది బబులోను రాజ్యమును సూచించుచున్నది. దాని రొమ్మును, భుజములును వెండివి. ఈ భాగము పర్షియా రాజ్యమును సూచించుచున్నది. ఈ ప్రతిమ ఉదరము, తొడలు ఇత్తడివి. ఈ భాగము గ్రీకు రాజ్యమును సూచించుచున్నది. మోకాళ్ళు ఇనుపవియు, పాదములలో ఒకటి ఇనుపదియు, ఒకటి మట్టిదియు అయి ఉన్నవి. ఈ ఇనుప కాళ్ళు రోమా సామ్రాజ్యమును, రెండు పాదములు రోమా సామ్రాజ్యము రెండు భాగములుగా విడిపోవుటను సూచించుచున్నది. ఇదే అధ్యాయము 44వ వచనంలో "పరలోకరాజ్యమందున్న దేవుడు ఒక రాజ్యమును స్థాపించును దానికెన్నటికిని నాశనము కలుగదు.... అది యుగయుగముల వరకు నిలుచును" అన్న ప్రవచనము

జరగబోవు దేవుని రాజ్య స్థాపనను సూచించుచున్నది.

అలాగే యెహెజ్కేలు 26:3-5 - క్రీస్తుకు పూర్వము 4,5 శతాబ్దములలో తూరు పట్టణము చాలా గొప్పది. ఇక్కడి ప్రజలు సముద్ర వ్యాపారములు చేసి విస్తారముగా ధనమార్జించిరి. చాలా ధన సంపాదనగల దేశము గనుక పట్టణము చుట్టూ ఒక గట్టి గోడ నిర్మించుకొన్నారు. ఈ పట్టణంలో ఎంత ధనము ఉన్నదో అంత పాపభూయిష్టమైనది. అందుకే ప్రభువు వాక్కు యెహెజ్కేలు ద్వారా ప్రవచించబడినది ఏమనగా, "తూరు పట్టణమా, నేను నీకు విరోధినైతిని, సముద్రము దాని తరంగములను పొంగజేయు రీతిగా నేను అనేక జనములను నీమీదికి రప్పించెదను. వారు వచ్చి తూరు యొక్క ప్రాకారములను, కోటగోడలను కూల్చి పడ గొట్టెదరు. నేను దాని మీదనున్న మంటిని తుడిచి వేసెదను. దానిని వట్టి బండగా చేసెదను..." ఇంకా 12-14 వచనములలో "వారు నీ ఐశ్వర్యమును దోచుకొందురు, నీ వర్తకమును అపహసించెదరు.... నిన్ను వట్టి బండగా చేతును, వలలు పరచుకొనుటకు చోటగుదువు. నీవు ఇక కట్టబడకయుందువు". ఈ ప్రవచనము నెరవేరునట్లు నెబుకద్నెజరు తూరు యొక్క ప్రాకారములను, కోటగోడలను పటగొట్టి దానిని వశపరచు కొన్నాడు. అయితే ఈలోపే ప్రజలు తమ ఐశ్వర్యమును, కలప, రాళ్ళు మొదలగు వాటిని తూరు పట్టణము నుండి ఒక కిలోమీటరు పడమరకు సముద్రములోనున్న ఎత్తైన ప్రదేశమునకు దాటవేసిరి. ఈ విధముగా ప్రవచన సగభాగము నెరవేరినది. సరిగ్గా 200 సంవత్సరములైన తర్వాత గ్రీసు దేశస్థుడైన అలగ్జాండరు తూరు దేశమును లొంగిపొమ్మని కబురు పంపగా వారు దానికి అంగీకరించలేదు. అప్పుడు అలెగ్జాండరు సముద్రములోని ఆ ఎత్తైన ప్రాంతమునకు క్రొత్తగా ఒకదారి నిర్మించుకొని సైన్యంతో లోనికి ప్రవేశించి సమస్త ఆస్తులను, కలపను, రాళ్ళను సముద్రములో ముంచి వేసెను. ఇప్పుడు ప్రవచన నెరవేర్పుగా ధ్వంసము కాబడిన పట్టణము తిరిగి కట్టబడలేదు. మత్స్యకారులు ఆ శిథిల పట్టణము దగ్గర తమ వలలను ఆరవేసుకొనుచున్నారు.

తూరు పట్టణమునకు ఉత్తరమున మరియొక పురాతనమైన సీదోను అను పట్టణము ఉంది. యెహెజ్కేలు 28వ అధ్యాయములోని ప్రవచనము సీదోను పట్టణము పూర్తిగా నాశనమగునని లేదు. అయితే తెగులు, రక్తపాతము జరుగునని ప్రవచింపబడెను. అలాగే అనేకమార్లు ఈ పట్టణము నకు జరిగినను అది ఇప్పటికి నిలిచియున్నది.

యూదులను గురించిన ప్రవచనము ఇలా ఉంది "మీకు మేలు చేయుచూ మిమ్మును విస్తరింప జేయుటకు మీ దేవుడైన యెహోవా మీయందు ఎలా సంతోషించెనో అట్లు మిమ్మును నశింపజేయుటకును మిమ్ము సంహరించుటకును యెహోవా సంతోషించును గనుక నీవు స్వాధీన పరచుకొనుటకు ప్రవేశించుచున్న దేశములో నుండి పెల్లగింపబడుదువు. దేశముయొక్క ఈ కొన మొదలుకొని ఆ కొన వరకును సమస్త జనములలోనికి యెహోవా నిన్ను చెదర గొట్టును... ఆ జనములలో నీకు నెమ్మది కలుగదు. నీ అరికాలికి విశ్రాంతి కలుగదు" ద్వితీయో. 28:63-65. ఈ ప్రవచనము అస్సీరీయులు బబులోనుకు ఇశ్రాయేలీయులను చెరగొనిపోబడుట ద్వారా, చివరిగా క్రీ॥శ॥ 70 సం॥లో రోమనుల ద్వారా యెరూషలేము పతనం కాబడినది. చరిత్ర కారుడైన జోసెఫస్ ఏమంటాడంటే క్రీ॥శ॥ మొదటి శతాబ్దంలో యూదులు లేని దేశము ప్రపంచంలో ఏది లేదట. యూదులను గురించి యెహెజ్కేలు 36వ అధ్యాయాలలో ఈ విధంగా ఉంది. "నేను అన్యజనులలో నుండి మిమ్మును తోడుకొని, ఆయా దేశములలో నుండి సమకూర్చి, మీ స్వదేశములలోనికి మిమ్మును రప్పించెదను ... నేను మీ పితురులకిచ్చిన దేశములో మీరు నివసించెదరు, మీరు నా జనులై యుందురు. నేను మీ దేవుడనై యుందును... మీ దోషముల వలన మీకు కలిగిన అపవిత్రతను తీసివేసి మీ పట్టణములలో మిమ్మును నివసింప చేయునాడు పాడై పోయిన స్థలములు మరల కట్టబడును. మార్గస్థుల దృష్టికి పాడుగాను, నిర్జనముగాను అగుపడిన భూమి సేద్యము చేయబడును. పాడైన భూమి ఏదెను వనమువలె ఆయెననియు జనులు చెప్పుదురు. అప్పుడు యెహోవానైన నేను పాడై పోయిన స్థలములను కట్టువాడ ననియు, పాడైపోయిన స్థలములలో చెట్లను నాటువాడననియు మీ చుట్టు శేషించిన అన్యజనులు తెలిసికొందురు. యెహోవానైన నేను మాట యిచ్చియున్నాను. నేను దాని నెరవేర్తును" యెహెజ్కేలు 36:26-28,33-36. అందుకే యేసుక్రీస్తువారి ఆరోహణ సమయంలో తన శిష్యులు "ప్రభువా, ఈ కాలమందు ఇశ్రాయేలునకు రాజ్యమును మరలా అనుగ్రహించెదవా?" (అపొ.కా. 1:6) అని అడిగారు. **(సశేషం)**

# ఉత్సాహముగా ఇచ్చుట...

ఇచ్చుట అనగా త్యాగము. త్యాగములో ప్రేమ ఉంటుంది. అంటే ఇచ్చుట అనగా ప్రేమించుట. ఇచ్చే గుణం లేనివారు ఏ మాత్రము త్యాగము చెయ్యలేరు. ప్రేమించని వారు ఏ త్యాగానికి సిద్ధపడరు. దేవుడు తన ప్రియ కుమారుడైన యేసుక్రీస్తును ఈ లోకంలోని పాపులను రక్షించుటకు ఇచ్చివేశాడు అనగా త్యాగము చేశాడు. "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతి వాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను (యేసుక్రీస్తును) అనుగ్రహించెను (యోహాను 3:16).

"దేవుడు ఉత్సాహముగా ఇచ్చువానిని ప్రేమించును" (1కొరింథీ. 9:7). కయీను, హేబెలు దేవునికి అర్పణ తీసుకెళ్ళినప్పుడు దేవుడు కయీను అర్పణ అంగీకరించక పోవడానికి కారణం ఎంటో బైబిల్లో పేర్కొనకపోయినప్పటికీ, దేవునికి ఇచ్చే విషయంలో అతనిలో ఏదో లోపం కనుగొన్నాడు దేవుడు. ఒకవేళ తల్లిదండ్రులైన ఆదాము హవ్వల బలవంతం మీదనో, లేక వాడుకగా తీసుకెళ్ళాలి కాబట్టి తీసుకెళ్దాము అనుకొన్నాడేమో. మొత్తం మీద కయీను హృదయం దేవునికి అనుకూలంగా, సంతోషంగా లేదని మనకు అర్థమవుతుంది. కాబట్టి దేవునికి ఇచ్చే విషయంలో మన హృదయం ఎలా స్పందిస్తుందో మనకి ఖచ్చితంగా తెలుస్తుంది. దేవున్ని ప్రేమించే వారు దేవుని కొరకు తన ధనమును, తన సమయాన్ని ఇవ్వడానికి ఏ మాత్రం వెను కాడరు. కొంతమంది అయితే సమయం అయితే ఇస్తారు కాని, ధనమును మాత్రము ఇవ్వరు. అందుకే యేసుప్రభువు మత్తయి సువార్త 6:24లో "ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండ నేరదు; అతడు ఒకని ద్వేషించి యొకని ప్రేమించును; లేదా యొకని పక్షముగా నుండి యొకని తృణీకరించును. మీరు దేవునికిని సిరికిని దాసులుగా నుండనేరరు" అని చెప్పాడు. దేవునికి ప్రత్యర్థిగా సిరిని (డబ్బుని) దేవుడు ఉదహరించాడంటే, మనుష్యులు డబ్బుని ఎంతగా ప్రేమిస్తారో దేవునికి తెలుసు.

నేను ఈ ఆర్టికల్ రాసేటప్పుడు కర్నూలులో ఒక పాస్టరు గారు దగ్గర నుండి నాకు ఫోన్ వచ్చింది. ఆయన 'పత్రికకు చందా ఎలా పంపించాలి?' అని అడిగాడు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఎందుకంటే గత నెలలో 500 మందికి పత్రికలో మనియార్డరు ఫారం పెట్టి పంపించాము. బహుశా ఆయనకు వెళ్ళిన పత్రికలో మనియార్డరు ఫారం ఉండి ఉండదు. మామూలుగా అయితే ఎవరికి వారే పోస్ట్ ఆఫీసుకి వెళ్ళి మనియార్డరు ఫారం కొనుక్కొని పూర్తిచేసి చందా పంపించాలి. కరెంటు బిల్లులు కట్టటానికి, ఫోన్ బిల్లులు కట్టటానికి, రేషను తెచ్చుకోచ్చుదానికి, ఇంకా వాళ్ళకి ప్రాధాన్యమైన విషయాలకి ఎంతసేపైనా క్యూలో నిలబడి వాళ్ళ పని పూర్తి చేసుకుంటారు. అలాంటిది దేవుని పని కొరకు, దేవునికి ఇవ్వడానికి కొంతదూరం నడవటానికి గాని, ఓపిగ్గా క్యూలో నిలబడటానికి గాని ఇష్టపడరు. సంవత్సర చందా 150/- రూపాయలు కట్టడం అదేమంత భారం కాదుగాని, దేవునికి ఇచ్చే విషయంలో ఉత్సాహం లేక పోవడం, ఒకవేళ ఇవ్వాలని ఉన్నా ఇవ్వలేకపోవడమనేది సాతాను దేవుని పనికి ఆటంకం కలిగిస్తుంది అన్న విషయం గ్రహించలేకపోవడం కారణాలు అవుతాయి. అలా కాకపోతే 500 మందికి మనియార్డరు ఫారాలు పంపిస్తే పట్టుమని పదిమంది కూడా వాటిని ఉపయోగించుకోకపోవడం చూస్తే సాతాను ఎంత బలంగా దేవుని పనిని అడ్డుకుంటుందో గమనించగలం. **ఒక సంఘమును నడిపిస్తున్న వారిని పోషించాల్సిన బాధ్యత సంఘ సభ్యుల మీద ఎలా ఉంటుందో, ఒక పత్రికను నడిపించే వారిని ప్రోత్సహించి, దేవుని వాక్యము వ్యాప్తి చెందుటకు చందాకట్టి సహకరించాల్సిన బాధ్యత పాఠకుల మీద ఉంది అన్నది సత్యము.** పత్రికను పోషించుట ద్వారా పాఠకులు దేవుని ఆశీర్వాదాలకు

పాత్రులు కాగలరు. దేవునికి ఇచ్చుట అనేది దేవున్ని ప్రేమించుటలో భాగమైతే మరి మనం దేవున్ని ప్రేమిస్తున్నామో మనకి ఎలా తెలుస్తుంది? దేవునికి ఇవ్వడం ద్వారానే కదా! అది ఉత్సాహంతో కూడుకొని ఉంటే మరి ఎక్కువగా ప్రేమిస్తున్నట్లు.

మరి ఆ ఉత్సాహం ఎలా ఉంటుందో తెలుసుకుందాం. దేవునికి ఇచ్చే విషయంలో హేబెలు యొక్క ఉత్సాహం మనం లోతుగా పరిశీలించాలి. హేబెలు తన మందలో తొలిచూలున పుట్టిన వాటిలో క్రొవ్విన వాటిని కొన్ని తెచ్చెను (ఆది.4:4). మంద అంటే కొన్ని వందల గొఱ్ఱెలు ఉండొచ్చు. వాటిలో ఏవి తొలిసారిగా చూలు కదుతున్నాయో గుర్తు పెట్టుకోవాలి. అవి ఈనిన తరువాత ఆ పుట్టిన వాటిని మరలా గుర్తుపెట్టుకోవాలి. అంటే తొలిసారిగా పుట్టినవి కాకుండా, తర్వాత పుట్టినవి కూడా ఉంటాయి కదా, అవి, ఇవి కలిసిపోకుండా చూసుకోవాలి. తొలిచూలున పుట్టిన వాటిలో కూడా క్రొవ్విన వాటిని అంటే నాణ్యమైన వాటిని దేవునికి ఇవ్వడం కోసం వేరుగా ఉంచాలి. అలా కాకుండా, దేవునికి ఇవ్వవలసిన సమయం వచ్చినప్పుడు ఏవో చేతికి అందినవి నాలుగు తీసుకొని ఇచ్చే పనైతే ఇంత కష్టపడాల్సి అవసరం హేబెలుకి వచ్చేది కాదు. అయితే దేవునికి యిచ్చే విషయం ఎంతో శ్రద్ధ చూపించాడు హేబెలు. అంటే ఆసక్తి, ఉత్సాహము చూపించాడు. అందుకే దేవుడు హేబెలు అర్పణ అంగీకరించాడు. "ఉత్సాహముగా యిచ్చే వారిని దేవుడు ప్రేమిస్తాడు".

మరి మన హృదయము ఎలా ఉంది? మనది హేబెలు లాంటి హృదయమా? కయీనులాంటి హృదయమా? అది మనకే తెలుస్తుంది. ధనమును ప్రేమించేవారు దేవున్ని ప్రేమించలేరు. ధనాపేక్ష (ధనమును ప్రేమించడం) సమస్త మైన కీడులకు మూలము (1తిమో.6:10) కాబట్టి ఆ ధనమును దేవుని చేతిలో పెట్టడం వలన మనం కీడు నుండి తప్పించుకుంటాము. మన ధనమును దేవుని కార్యములకు ఖర్చుచేయటం వలన పరలోకరాజ్యములో మనం ధనమును దాచుకుంటాము (మత్తయి 6:20). దేవుడు మిమ్మును మీ కుటుంబాలను ఆశీర్వదించి, మీ ప్రతి అవసరతను తీర్చాలని ప్రార్థిస్తున్నాము.


## పాఠకులకు ముఖ్య గమనిక

**'పరిశుద్ధత'** మాసపత్రికను మీరు ఎంతగానో ఆదరిస్తున్నందుకు మీకు మా కృతజ్ఞతలు. పత్రిక కావాలని అనేకమంది ఉత్తరాల ద్వారా, ఫోన్స్ ద్వారా అడుగుతున్నారు. "మీ పత్రిక ఫలానా చోట చూశాము. మీ పత్రిక చాలా బాగుందండీ, మా అధ్యాత్మిక జీవితానికి ఎంతో మేలుకరంగా ఉంది. దయచేసి మాకు కూడా పంపండి. మేము చందా కడతాము" అని అడుగుతున్నారు. అలా అడిగిన వాళ్ళందరికీ పంపాలంటే ఇప్పుడు చందా కట్టకుండా ఉచితంగా పత్రిక పొందుతున్న వాళ్ళందరికీ ఆపాలి. అందుకనే గత నెల (సెప్టెంబరు) పత్రికతో పాటు మనియార్డరు ఫారం పంపించాము. మనియార్డరు ఫారములు దొరక నందువలన కేవలం 500 మందికే పంపించాము. అయితే వాటిని ఉపయోగించుకున్న వారు కొద్దిమంది మాత్రమే. కాబట్టి మనియార్డరు ఫారము అందుకున్న వారు డిసెంబరు లోపు చందా పంపించక పోయినట్లయితే జనవరి-2017 నుండి వారికి వరుస క్రమంలో పత్రిక ఆపివేయబడుతుంది అని తెలియజేస్తున్నాము. మా మట్టుకైతే ఎవరికీ పత్రిక ఆపటం ఇష్టంలేదు. కానీ, పత్రిక కావాలంటూ చందా కట్టడానికి సిద్ధంగా ఉన్నవారికి మేము పంపలేక పోవడం మమ్ములను బాధిస్తుంది. తప్పనిసరి పరిస్థితులలో ఈ నిర్ణయం తీసుకోవటం జరిగింది. నేటి పరిస్థితులలో పత్రిక నిర్వహణ చాలా వ్యయప్రయాసలతో కూడుకొని ఉన్నప్పటికీ, కేవలం విశ్వాసము ద్వారానే ఈ పత్రిక నిర్వహించగలుగు తున్నాము. అయితే పాఠకులు చందా కట్టడం తమ బాధ్యతగా గుర్తించాలి. ఎందుకంటే మీరు చందా కట్టడం వలన ఇంకా అనేకమందికి పత్రిక పంపడానికి సాధ్య మవుతుంది. సంవత్సరమంతటికీ కలిపి కేవలం 150/- రూపాయలు అన్నది ఎన్నతగినది కాదు. కావున పాఠకులు సహృదయముతో ఆలోచించి చందా కట్టవలసినగా ప్రభువు పేరట వేడుకొనుచున్నాను.

**- ఎడిటర్**

5

# ఏడు సంఘాలు



బ్రదర్ కె.సామ్రాట్

## తుయతైర సంఘము

**(దుర్నీతితో నిండిన సంఘము. ప్రకటన 2:18-29)**

**లోపాలు:** "అయినను నీ మీద తప్పు ఒకటి నేను మోపవలసియున్నది. ఏమనగా, తాను ప్రవక్తనని చెప్పుకొనుచున్న యెజెబెలను స్త్రీని నీవుండనిచ్చుచున్నావు. జారత్వము చేయుటకును, విగ్రహములకు బలియిచ్చిన వాటిని తినుటకును అది నా దాసులకు బోధించుచు వారిని మోసపరచుచున్నది (2:20). ఇది చాలా తీవ్రమైన విషయం. సంఘంలో వారు యెజెబెలు అను స్త్రీని, బోధల్ని ఉండనిచ్చారు. అని ఆరోపణ చేయబడింది. ఈ యెజెబెలు అన్యరాజు కుమార్తె. యూదుడైన అహాబు రాజును పెండ్లాడి, అతన్ని తన వశము చేసికొని దేవుని సేవకు బద్ధ విరోధురాలైంది. ఈమె దుర్మార్గురాలైన స్త్రీ, ఈమె వ్యభిచారిణి, మంత్రగత్తె, అబద్ధ ప్రవక్త్రి, ముస్తాబై ముఖానికి రంగులు పూసుకొని యెహూని ఆకర్షించాలని (2రాజులు 9:30) ప్రయత్నించింది. పరిశుద్ధాత్మ దేవుడు చెప్పిందేమిటి? స్త్రీ సంఘంలో మౌనంగా ఉండాలి తప్ప బోధించకూడదు (1తిమోతి 2:11, 1కొరింథీ. 14:34). అయితే తుయతైర సంఘంలో "యెజెబెలు అను స్త్రీ పనిచేస్తుంది. ప్రభువు కూడా ఆమెను యెజెబెలు అని పిలుచుచున్నాడు. ఈమె 450 మంది బయలు ప్రవక్తల్ని పోషిస్తుంది. ఈ అబద్ధ ప్రవక్తలు ఇశ్రాయేలీయులు బయలు దేవతను ఆరాధించేటట్లు చేశారు (1రాజులు 18:19) యెజెబెలు అమాయకుడైన నాబోతును చంపించింది (1రాజులు 2:13), ఈ మహారాక్షసి, యెజెబెలు, దేవుని ప్రవక్తయైన ఏలీయాను చంప ప్రయత్నించింది. ఒకదూత చేత ఏలీయాకు వర్తమానము పంపింది (1రాజులు 19:2). అహాబు సున్నతి పొంది ఇశ్రాయేలు రాజు. పవిత్రమైన ధర్మశాస్త్రము గలవాడు, నీతిగా, భక్తిగా జీవించి దైవదృష్టిలోను, ప్రజల దృష్టిలోను మంచి పేరు పొందినవాడు. అయితే విగ్రహారాధికురాలైన అన్యస్త్రీ చేతిలో కీలుబొమ్మయై దేవుని దృష్టికి విరోధి అయ్యాడు. ఆమెయే అతడిని చెడు చేయునట్లు ప్రోత్సహించింది (1రాజులు 21:25). ఇలాంటి స్త్రీ లక్షణాలు గమనిస్తే ఆమె 1. ప్రవక్త్రి, 2. జారత్వం, 3. విగ్రహార్పిత పదార్థాలు తినటం, 4. నిజమైన విశ్వాసుల్ని శ్రమపెట్టడం. యివి పాతనిబంధన లోని స్వభావాలే. అవి నీతి పరురాలైన ఈ స్త్రీ ప్రకటన గ్రంథం 17వ అధ్యాయంలో ఏడు తలలుగల ఎర్రని మృగముపై కూర్చున్న మహావేశ్యను సూచిస్తుంది. ఆ దుష్ట స్త్రీ రోమన్ కథోలిక్ మతవ్యవస్థయే. ఈ కాలానికి అంధకార యుగమని పేరు. సంఘం చెడిపోయింది. నిజవిశ్వాసులకు శ్రమలు కలిగాయి. యూరప్ ఖండంలో మూడున్నర లక్షల విశ్వాసులు కథోలిక్ వారిచేత చంపబడ్డారు.

తుయతైర సంఘ ప్రజలు రెండు రకాల పాపాలు చేయునట్లు అబద్ధ ప్రవక్తలు బోధించారు. ఒకటి లైంగిక అవినీతి, రెండు విగ్రహారాధన, క్రైస్తవ జీవితంలో ఈ రెండు విషయాలపై ఎంతో జాగ్రత్త వహించాలి. దేవునితో మన సంబంధం కేవలం ఆరాధన, ప్రార్థన, ఉపవాస జీవితాలకే పరిమితం కాకూడదు. వ్యక్తిగత, లైంగిక, వైవాహిక విషయాల్లో దేవునికి లోబడాల్సి ఉంది. జారత్వాన్ని పూర్తిగా సంఘం విసర్జించాలి (అపొ.కా. 15:20,28). వ్యక్తిగత పవిత్రత, సంఘ పరిశుద్ధత నైతిక జీవితం విడదీయరానివి. పరిశుద్ధత మన జీవిత లక్ష్యంగా ఉంచుకొని ప్రవర్తించాలి.

అయితే తుయతైర ఈ విషయాన్ని గుర్తించకుండ, పరిశుద్ధత విషయంలో విఫలమై లైంగిక అవినీతిని ఆశించి అపజయం పాలైందని ప్రభువు గద్దిస్తున్నాడు. సంఘమా! సరిచేసుకో, సంఘమంటే క్రీస్తు అవయవములనేగా అర్థం. ఒకడు జారత్వం చేస్తే క్రీస్తు అవయములను తీసికొని వేశ్య యొక్క అవయవములను తీసికొని వేశ్య యొక్క అవయవములుగా చేయుచున్నాడు (1కొరింథీ. 6:15). సంఘంలో ఎవరైనా ఇట్టి తప్పులో ఉన్నారని తెలిస్తే, వెంటనే వారిని వాక్యాను సారంగా హెచ్చరించాలి. ముందు ఒంటరిగానున్నప్పుడు చెప్పాలి. వింటే సరి లేకపోతే సంఘం యెదుట గద్దించాలి (1తిమోతి 5:20). ఇంకను వినకపోతే వారిని వెలివేయాలి (1కొరింథీ. 5:13). కారణం అట్టివాడు మార్గం తప్పి తనకు తానే శిక్ష విధించుకొనినవాడై పాపము చేయుచున్నాడు (తీతుకు 3:11). దేవుని నామమును అన్యజనుల మధ్య దూషింపచేయుచున్నాడు (రోమా 2:24).

రెండవ తప్పు విగ్రహాలకు బలి యిచ్చిన వాటిని తినడం. యిదో భ్రష్ట విషయం. దేవుడు సంఘాన్ని పవిత్రంగా ఉండమని ఖచ్చితంగా చెప్తుంటే, దయ్యాలకు అర్పించిన వాటిని వీరు తింటున్నారు (1కొరింథీ. 10:20). ఈ జీవన విధానం వల్ల సంఘం ఆత్మీయంగా పతనమై, లోకం సంఘంలోకి వచ్చేసి రెండూ ఒకటిగా కలిసిపోయాయి. విగ్రహార్పితమైన వాటిని తినటం దేవున్ని అగౌరపరచటమే. సంఘము ప్రత్యేకింపబడింది, కాని విగ్రహార్పిత విషయాలలో కూడా ప్రత్యేకించబడాలి. వాక్యం ప్రకారం మనమంతా దేవ ప్రతిష్ఠితులం. అందుకే దేవునికి అంగీకారంగా ఉండాలి. తుయతైర విగ్రహార్పితమైన వాటిని తినటం వలన బలహీనులను అభ్యంతరపరచిన వారౌతున్నారు (1కొరింథీ. 8:10). ప్రభువుకు రోషము పుట్టిస్తున్నారు. విగ్రహార్పితాలు తినటాన్ని చులకనగా చూసి దానిలో ఏముందిలే అనుకుంటే, దేవునికి అయిష్టత కలిగించటమే అవుతుంది. పైగా లోకంలో మన సాక్ష్యాన్ని బలహీనపరుస్తుంది. అంతమాత్రమేగాక అది చెడుతనం పట్ల మనల్ని చైతన్య రహితులుగా చేసి, ఘోర పతనానికి దారితీస్తుంది. కావున భోజన పదార్థములనుబట్టి కాక కృపనుబట్టియే హృదయమును సిద్ధపరచుకొనుట మంచిది (హెబ్రీ. 13:9). సంఘం ప్రజలకి దైవభీతి నేర్పి, దేవుని వైపు మరల్చే క్షేమ విషయాలు వివరించాలి. విగ్రహార్పితాలకు విగ్రహారాధనకు దూరంగా ఉండాలి.

ఈ సంఘము ఈ అవినీతి కార్యాలకు లోనైపోవుటకు కారణం యెజెబెలు బోధలే సుమా. "నా దాసులకు బోధించుచూ వారిని మోసపరచుచున్నది". ప్రజలు దారి తొలగునట్లు చేస్తుంది. నాయకుడే దారి తప్పి నడుస్తుంటే, విశ్వాసులు దారి తొలగటంలో విచిత్రమేముంది? యెజెబెలు దుర్బోధలు ప్రజల్లో వ్యాపించాయి. దైవ ప్రమాణాలను మార్చేసింది. మోసంతో బోధలు చేస్తుంది. ఈ మోసాన్ని గ్రహించి, జీవితాల్ని జాగ్రత్తగా కాపాడుకున్న వారినందర్ని యెజెబెలు వేధించుకు తినేసింది. **(సశేషం)**

## * : పాఠకులకు అతి ముఖ్య గమనిక : *

'పరిశుద్ధత' మాసపత్రిక ఆన్‌లైన ఎడిషన్ ప్రారంభించిన తర్వాత పత్రిక కావాలని అభ్యర్థిస్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా మేము ఎప్పుడు పత్రిక చందా గురించి పాఠకులను అడగలేదు. అయితే క్రొత్తగా పత్రిక కావాలంటున్న వారికి పంపించాలంటే ఎక్కువ పత్రికలు ముద్రించాలి. కాబట్టి పాఠకులు చందా తప్పని సరిగా కట్టాల్సిన పరిస్థితి వచ్చింది. ఒకవేళ పత్రిక చదివే తీరిక లేక మీరు చదవకపోతుంటే పత్రిక 'స్టాప్' చెయ్యమని 9440217726 నంబరుకు మాకు ఒక్క మెసేజ్ పెట్టటం వలన, ఆ పత్రికను కొత్తవారికి పంపిస్తాము. పాఠకులకు మేము ఇలాంటి అభ్యర్థన పంపినప్పుడు చాలామంది స్పందించటం లేదు. కాబట్టి అసలు వారు పత్రిక చదువుతున్నారో లేదో కూడా అర్థంకాని పరిస్థితి. కాబట్టి మా అభ్యర్థనలకు స్పందించని వారు పత్రిక చదవని వారుగానే భావించి, జనవరి-2017 నుండి వారికి పత్రిక నిలిపి వేయుటకు నిర్ణయించాము. కావున చందా చెల్లించని వారు డిసెంబరులోపు చందా చెల్లించగలరని ఆశిస్తున్నాను. **-ఎడిటర్**

స్త్రీల విభాగము

# యోబు భార్య



శ్రీమతి కె. రేచల్ జోసఫ్,
హన్నా ఉమెన్స్ ప్రెసిడెంట్

బైబిల్‌లో కొందరి పేర్లు వ్రాయబడి లేదు. లోతు భార్య, యోబు భార్య, షునేమీయురాలు సారెపతు విధవరాలు, సమరయ స్త్రీ ఇలా కొందరి పేర్లు వారి భర్త పేరుతోనో లేక వారు నివసించే స్థలము పేరుతోనో వ్రాయబడినవి. యోబు పేరు తెలియని వారు లేరు. యోబు ఊజు దేశములో మంచి పేరు తెచ్చుకొన్నాడు. బహు సంపద కలిగినవాడు. అన్ని విషయములలోను ఆశీర్వదింపబడిన యోబు తన భక్తి జీవితములో కూడ అభివృద్ధి పొందుచుండెను.

ఈనాడనేకులు ఆర్థికంగా ఆశీర్వదింపబడిన తరువాత ఆధ్యాత్మికంగా పతనమైపోతున్నారు. అయితే యోబు ఆస్తి మీద కాక అన్ని ఇచ్చిన ప్రభువు మీదే తన గురిని నిలిపాడు. యోబు భార్య యోబువలె భక్తిపరురాలు కాక పోయినప్పటికి యోబునుబట్టి ఆమెయు అన్ని విషయాలలో ఆశీర్వాదమును అనుభవించుచుండెను. యోసేపు పోతీఫరు అను అన్యుని ఇంటిలో పనిచేస్తున్నప్పుడు యోసేపునుబట్టి ఆ పోతిఫరు కూడ ఆశీర్వదించబడెను. పరిశుద్ధ జీవితం జీవించేవారు వారి మట్టుకు వారేకాక ఇతరులకుకూడ ఆశీర్వాదంగా ఉంటారు. అనేకసార్లు భార్య ఆశీర్వాదాలకు అర్హురాలు కాకపోయినా భర్తనుబట్టి ఆశీర్వదింపబడుతుంది. అలాగే భర్త యోగ్యుడు కాకపోయినా భార్య యొక్క ప్రార్ధనునుబట్టి ఆశీర్వదింపబడతాడు. యోబు భార్య ఈ కోవకు చెందినది. యోబుకున్న భక్తి విశ్వాసము, ప్రార్ధన యోబు భార్యకులేవు. యోబు అరుణోదయమున లేచి దేవునికి బలులు అర్పించేవాడని బైబిల్‌లో వ్రాయబడి ఉన్నది. యోబు భార్యలో అటువంటి ప్రార్ధనలేదు. తుఫానువలె శోధనలు శ్రమలు వచ్చినపుడు యోబు విశ్వాసం స్థిరంగా ఉండెను. ఒక్క దినముననే గొఱ్ఱెలు, మేకలు, ఒంటెలు, గాడిదలు ఉన్న సమస్త ఆస్తి చివరికి కన్న పదిమంది బిడ్డలు కూడా పోయినప్పటికి యోబు యెహోవా ఇచ్చెను యెహోవా తీసుకొనిపోయెను అని చెప్పి నిబ్బరముగా ఉండగలిగాడు. అయితే యోబు భార్య అట్లు అంగీకరించి నట్లు కనబడలేదు. యోబు చివరికి తన ఆరోగ్యమును కూడ పోగొట్టుకొని మానసికంగాను శారీరకంగాను కృంగి యుండగా యోబు భార్య భర్తను గౌరవించలేదు. యోబుకు కష్టాలు ప్రారంభమైన తరువాత ఆమె యోబుతో ఉన్నట్లు కనిపించ లేదు. యోబు స్నేహితులు వచ్చి పరామర్శించారు. కాని యోబు భార్యలో ఈ పలకరింపు లేదు. యోబు అరికాలు మొదలుకొని నడినెత్తి వరకు బహు వేదనకరమైన కురుపులతో బూడిదలో కూర్చొని చిల్లపెంకుతో గోక్కొనుచుండగా అన్నీ పోయినా నేనున్నాను గదండి అని ఆదరించవలసిన యోబు భార్య ఇంకా ఎందుకయ్యా నీ భక్తి దేవుని దూషించి మరణము కమ్మనెను. ఇది ఎంత భయంకరము. యోబు భార్య మాటను సాతాను మాటలని గుర్తించ గల్గిన యోబు మూర్ఖురాలు మాటలాడు నట్లు నీవు మాటలాడుచున్నావు. మనము దేవుని వలన మేలు అనుభవించుదుమా కీడును మనము అనుభవించ తగదా అని గద్దించెను.

బలవంతుడైన సమ్సోను సాతానునిచే ప్రేరేపించబడిన దెలీలా మాటలకు ప్రాణము విసిగి చావగోరినట్లుగా యోబు చావగోరలేదు గాని నేను చావను బ్రతికి దేవుని కార్యాలను వివరింతును అన్నట్లుగా ఉండెను. దేవుని కృపను బట్టి యోబు భార్య తన భర్త గద్దింపును తీసికొనెను. మరలా పదిమంది బిడ్డలను సంపాదించుకొనెను. పోగొట్టుకొనిన సకల సంపదలు రెండంతల ఆశీర్వాదముగా పొందెను. ఈ వర్తమానము చదువుచున్న బిడ్డలారా మీ కుటుంబంలో వస్తున్న శోధనలను ఎదుర్కొన గలుగుచున్నారా? “సర్వకృపానిధియును దేవుడు కొంచెము కాలము మీరు శ్రమపడిన పిమ్మట తానే మిమ్మును పూర్ణులనుగా చేసి స్థిరపరచి బలపరచును” (1పేతురు 5:10) అని నమ్మి శోధనలో శ్రమలలో దేవుని విడువక ఉండినచో దేవుడు మిమ్మును దీవించును.

సాక్ష్యము

# బాంబులు పట్టిన చేతిలో బైబిల్...!

"ఫ్యాక్షనిజం" అనే మాట వినగానే దక్షిణ భారతదేశం లోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, మరి ముఖ్యంగా రాయలసీమ లోని జమ్మలమడుగు, పులివెందుల ప్రాంతంలో ప్రతీకారం, రక్తపాతం, మారణహోమం స్ఫురిస్తాయి. ఫ్యాక్షనిజం అసంఖ్యాకమైన ప్రాణాలను పొట్టనబెట్టుకుంది. ప్రతి చావూ బహు భయానకంగా, హింసాత్మకంగా ఉంటుంది. కరుణ, ప్రేమ, జాలి, క్షమాపణ అనేవి ఫ్యాక్షనిజం చరిత్రలోనే లేవు. ఎవరిని కాటేద్దామా అని భయంకర మారణాయు ధాలు అస్తమానం పొంచి ఉంటాయి. వేట కొడవళ్ళను, కత్తులను, రైఫిళ్ళను, రివాల్వర్లను, బాంబులను అక్కడ బహు విచ్చలవిడిగా ఉపయోగిస్తారు. ఈ రాయలసీమలో ఫ్యాక్షనిజం రాజ్యమేలుతున్నది. రాజకీయవేత్తలు, వ్యాపారవేత్తలు మొదలుకొని సామాన్యుల వరకు ఇందులో మునిగిపోయారు. కేవలం దీనికి కావలసిందల్లా పగతో రగిలే గుండె, రక్తదాహం, ప్రత్యర్థి రక్తపుమడుగులో గిలగిలా కొట్టుకుంటుంటే చూడాలన్న కసి!

నాశన మార్గంలోగుండా ప్రయాణించిన జమ్మలమడుగుకు చెందిన ఒక రాజకీయవేత్త జీవితగాథ ఇది. పద్నాలుగు సుదీర్ఘ సంవత్సరాలు రాయలసీమ పొలాల్లో మరణం, వినాశనం అనే బీజాలు వెదజల్లిన ఫ్యాక్షన్ రాజకీయవేత్త కథ ఇది. కరడుగట్టిన క్రౌర్యంతో కూడిన హింసామార్గంలో ప్రజానీకాన్ని భయభ్రాంతుల్ని చేస్తూ, చట్టం స్థానంలో తన స్వంత ఆటవిక నీతిని ప్రవేశపెట్టి, త్రాగుడు, స్వనాశనం అనే ఊబిలోకి దిగిపోయిన ఒక మనిషి గుండెలు పిండివేసే గాథ. శాశ్వత నరకశిక్షకు జోగుతూ ఒకరోజు అనుకోకుండా యేసుప్రభువుకు మొర్రపెట్టి జీవితంలో శాశ్వత మార్పును అనుభవించిన మైఖేల్ విజయకుమార్ జీవిత గాథ ఇది.

మైఖేల్ పుట్టినది ఒక సంపన్న డాక్టర్ల కుటుంబం. వీరి తల్లిదండ్రులు డాక్టర్లు. వీరి తల్లి డా॥ రత్తమ్మ ప్రస్తుత ముఖ్యమంత్రి డా॥ వై.యస్. రాజశేఖర్ గారి సొంత మేనత్త. అయితే మైఖేల్ విచ్చలవిడి జీవితానికి అలవాటుపడ్డాడు. రాజకీయ విజయాల పిచ్చిలో పడిపోయి తనకడ్డొచ్చిన దేనినీ అతడు లక్ష్యపెట్టలేదు, సహించలేదు. తన భార్యబిడ్డలను సైతం. వారి క్షేమం కోసం, తన ఫ్యాక్షనిజానికి వారు అడ్డురాకుండా తన ముగ్గురు పిల్లలనూ పిన్న వయస్సులోనే వేరే రాష్ట్రంలో బోర్డింగు స్కూళ్ళకు పంపించి వేశాడు. ఇరవై ఆరేళ్ళ ప్రాయంలో ఇంటా బయటా కూడా అతని జీవితం హింసతో, బాంబు పేలుళ్ళతో, రైఫిళ్ళతో, తుపాకులతో, కొడవళ్లతో, గొడ్డళ్ళతో నిండిపోయింది. క్రౌర్యం, హింస, దుర్మార్గతల దుర్గంధాలలో అతడు మునిగి పోయాడు. అతని మాటల్లోనే అతని కథ ఇది. చదవండి...

యేసుప్రభువు తక్కువ కులానికి చెందినవారి దేవుడనీ, పోరాడేందుకు శక్తిలేని కారణంగా ఆయన చనిపోయాడనీ అనుకునేవాణ్ణి. హిందూవులకీ, ముస్లిములకీ, క్రైస్తవులకీ వేరువేరు దేవుళ్ళు ఉన్నారనుకునేవాణ్ణి. మనుషులు దేవునితో సంబంధం కలిగి ఉండడం సాధ్యమని నేనెన్నడూ అనుకోలేదు. జీవితంలో ఆస్తులు, అంతస్తులు ఉంటే అదే ధన్యత అనుకునేవాణ్ణి. దేవుని గురించి ఇలాంటి తారుమారు ఆలోచనలతో ఆయన్ను నేను లెక్కచెయ్యలేదు. ఫలితంగా బ్రతుకు దుర్భరమైపోయింది. జీవితంలో ఏదో సాధించాలనీ రాజకీయాలలో ప్రవేశించాను. ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రి కావాలని తపనతో జీవించాను. ఇదే నా జీవితాశయం. చాలా డబ్బు, పరపతి, అధికారం కోరుకున్నాను. ఉన్నత శిఖరాలు అధిరోహించాలనీ, అదే నిజమైన ఆశీర్వాదమనీ ఎంచాను. రాజకీయాల్లోకి లోతుగా కూరుకుపోతున్న కొద్దీ నా బ్రతుకు మరీ పాపభరితంగా, బీభత్సంగా తయారయింది. నేను కేవలం ఉన్నత స్థితికి చేరుకోవాలనుకోవడమే కాదు, అందుకోసం చాలా ప్రమాదకరమైన మార్గాలు అవలంబించాను. నా ప్రత్యర్థి, జమ్మలమడుగు ఎమ్మెల్యే అయిన గుండ్లకుంట శివారెడ్డి చాలా ప్రమాదకరమైన ఫ్యాక్షనిస్టు. మా ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితిలో బాంబులు, తుపాకులతో భీకరమైన ఫ్యాక్షనిజం మొదలైంది. బాంబులు, కొడవళ్ళు, తుపాకులు, బాడీగార్డులను నమ్ముకొని నా జీవితమంతా ఫ్యాక్షన్ పగలు, కోర్టుకేసులతో నిండిపోయింది. నా పద్నాలుగేళ్ళ ఫాక్షన్ రాజకీయాలు అనేకమంది

చావుకు కారణమయ్యింది. నా ఉనికి నిలుపుకొనేందుకు హత్యలకు సైతం వెనుకాడేవాణ్ణి కాను. నా శత్రువు నా ప్రాణాలు తీయాలనీ, నేను అతని ప్రాణాలను తీయాలనీ ఎదురు చూస్తుంటాము. నేను అతణ్ణి చంపకపోతే అతడు నన్ను చంపుతాడు. మేము ఒకరినొకరు మట్టుపెట్టడం కోసం అనేక ప్రయత్నాలు చేసుకుంటూ ఉండేవాళ్ళం.

నా భార్య ప్రార్థన చేసే క్రైస్తవురాలు, విశ్వాసి. నా గురించి మానక ప్రార్థిస్తూ ఉండేది. అయితే ఆమెను నిర్దాక్షిణ్యంగా కొడుతూ, పశువుకన్నా హీనంగా చూసేవాణ్ణి. పీకలదాకా మద్యం తాగేవాణ్ణి. క్రమేణా త్రాగుడుకు అలవాటు పడిపోయి దాన్ని వదిలించుకోలేని స్థితికి వచ్చాను. నా మీద నాకు అదుపులేదు. అడుగడుగునా ప్రమాదం పొంచి ఉన్న నా జీవితవిధానం మూలంగా కలిగే వత్తిడి కారణంగా తాగుడుకు బానిసనయ్యాను. భార్యను కొట్టడం, ఇంటి నుండి తరి మెయ్యడం ఎక్కువైపోయింది. చాలాసార్లు ఆమెకు తీవ్ర గాయాలైనాయి. తుపాకిని ఆమె తలకు ఆనించి బెదిరించే వాణ్ణి. పిల్లలతో కూడా చాలా కౄరంగా ప్రవర్తించేవాణ్ణి. వారి జీవితం క్షణక్షణం భయం, బాధ. నా భార్యని బయటికి వెళ్ళగొట్టిన సమయాలలో ఆమె ఆ వైపున ఉన్న పొదలవద్ద రాత్రి గడిపేది. అక్కడంతా పాములు, తేళ్ళు. అలాంటి పరిస్థితుల్లో కూడా నా గురించి ప్రార్థించేది. ప్రభువామెను సంరక్షించాడు.

ఆమె ప్రార్థనలు ఎంత మనఃపూర్వకంగా ఉండేవంటే మా కుటుంబంలో దేవుని కాపుదల స్పష్టంగా కనిపించేది. నేను వేరే ఊర్లు వెళ్ళినప్పుడు శత్రువులు నన్ను మట్టుబెడతారని భయంగా ఉండేది. తుపాకులు, బాంబులు, కొడవళ్ళు పట్టుకుని నా చుట్టూ ఎప్పుడూ బాడీగార్డులు ఉండేవారు. మా బాంబులు మేమే తయారుచేసుకునేవారం. మా దారికి అడ్డొచ్చిన ఎవరినైనా హతమార్చే హంతక ముఠా మాది. ఎప్పుడూ మాపై పోలీసుల నిఘా ఉండేది. అత్యంత ప్రమాదకరమైన నేరస్థునిగా నేను పోలీసు రికార్డుల్లోకి ఎక్కాను. చాలాసార్లు జైలుకి వెళ్ళాను. ఇది నన్ను మరింత రెచ్చగొట్టేది. నేషనల్ సెక్యూరిటీ చట్టం కింద కూడా నన్ను బుక్ చేసి జైల్లో వేశారు. జన సామాన్యానికి ముప్పుగా పరిణమించిన వారిని ఈ చట్టం కింద నిర్బంధిస్తారు. అయితే ఇదంతా నా బ్రతుకును మార్చలేకపోయింది. నేనన్నా నా నిర్ణయాలన్నా మనుషులు వణికిపోయేవారు. మా ఇంట్లో ఎప్పుడూ నాటు బాంబులు వాడకానికి సిద్ధంగా ఉండేవి. నాదగ్గర లైసెన్సు లేని మారణాయుధాలెన్నో ఉండేవి. ఒకసారి పోలీసులు మా ఫారం హౌస్‌పై దాడిచేసి 108 బాంబులు పట్టుకున్నారు. వార్తాపత్రికల్లో 'బాంబుల స్థావరం పట్టివేత' అని పతాక శీర్షికల్లో ప్రచురించారు. నా మీద ఎన్నో క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. చాలాసార్లు అరెస్టయ్యాను. నేరస్థుడిగా కోర్టుకు హాజరుకావడం దైనందిన చర్యగా మారిపోయింది. నేనంటే వారు భయపడే వాళ్ళు.

ఆ రోజుల్లో ఫ్యాక్షన్ కొట్లాటలు తరచుగా జరుగుతుండేవి. మేము తుపాకులు, బాంబులు యథేచ్ఛగా వాడేవాళ్ళం. ఈ కౄరమైన, విచ్చలవిడి హింసాత్మక చర్యల మూలంగా ఎంతోమంది హతులయ్యారు. అసలు నేను ఎన్నడో చని పోయి నరకంలో కాలుతూ ఉండేవాణ్ణి. నా భార్య ప్రార్థనలు నన్నూ, నా కుటుంబాన్నీ సంరక్షిస్తూ వచ్చాయి. నా బాడీ గార్డులు కరడుగట్టిన హంతకులు. వారికోసం విచ్చలవిడిగా డబ్బు ఖర్చుపెట్టేవాడిని. అంత డబ్బు ఖర్చు చెయ్యడంకంటే వారికి జీతం ఏర్పాటు చేయమని నా భార్య సలహా ఇచ్చింది. ఈ మాట వారిలో కొందరు వింటే, వారిలో ఒకడికి కోపం వచ్చింది. నా భార్యని చంపెయ్యాలని అనుకున్నాడు. "సార్, మీరు సరేనంటే ఆమెని చంపేస్తాం" అన్నాడు. ఆరోజు నేను త్రాగి ఉండుంటే సరే అనేవాడినేమో కాని దేవుని కృపనుబట్టి త్రాగలేదు. కాబట్టి 'వద్దు' అన్నాను. అది అక్కడితో అయి పోలేదు. ఒకసారి నా బాడీగార్డు బియ్యం డ్రమ్ములో నాటు బాంబులు పెట్టాడు. నా భార్య వ్రేళ్ళు దానికి తాకితే చాలు, అవన్నీ ఒక్కసారిగా పేలి క్షణంలో ఆమెను నామరూపా ల్లేకుండా చేసేవి. నా బాడీగార్డుల పైశాచిక పథకాలు అలా ఉంటాయి. అయితే ఇంట్లో పనిమనిషి ద్వారా దేవుడామెకు ఈ సంగతి తెలిసేలా చేశాడు. దేవుని కాపుదల నిత్యమూ ఆమె వెన్నంటి ఉండేది.

నా భార్యకు దేవునితో దృఢమైన వాస్తవిక సంబంధం ఉండేది. నేనెంత దుర్మార్గుడినైనా, నమ్మదగనివాడినైనా, ఆమె మాత్రం నిర్మలమైన హృదయంతో నన్ను ప్రేమించింది. నా ఆత్మ విషయంలో ఆమె అస్తమానం క్షోభపడింది. పొద్దున ఇల్లొదిలితే రాత్రి భోజనానికి తిరిగి వస్తానా? అన్న భయంతో నేను తిరిగి వచ్చేదాకా ఆమె మోకాళ్ళ మీదే ఉండేది. నా పట్ల ఆమె ప్రేమ అంత గొప్పది.

**(ఇంకావుంది)**

# లోకంతీరు



(పుట్టుక చావు మధ్య సంబరం)

**నా తల్లి గర్భమందు నన్ను నిర్మించిన వాడవు నీవే. నీవు నన్ను కలుగజేసిన విధము చూడగా భయమును ఆశ్చర్యమును నాకు పుట్టుచున్నవి.**

నేటి మానవులకి "డబ్బు" మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టు లాంటిది. తన అవసరాలను తీర్చే దేవుడిని కాదని మనిషి డబ్బుని ఆశ్రయించటం దేవుని ఆజ్ఞని మీరటమే. ఈ డబ్బు సంపాదనలో దేవుడిచ్చే శాంతి సమాధానా లను, దేవుని సన్నిధిని కోల్పోయి ఈ లోకంలో నానా రకాల పాపాలను చేయడానికి దేవుడు మనిషికిచ్చిన తెలివితేటలను ఉపయోగిస్తు న్నాడు. ***"ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము, కొందరు దానిని ఆశించి విశ్వా సము నుండి తొలగిపోయి నానా బాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి"*** 1 తిమోతి 6:10. డబ్బును ప్రేమించే వారు దేవున్ని ప్రేమించలేరు. డబ్బును ప్రేమిస్తూ దేవునికి చందాలిచ్చేవారు దేవున్ని ప్రేమించి ఇస్తున్నారా? *ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండనేరడు; అతడు ఒకని ద్వేషించి యొకని ప్రేమించును..... మీరు సిరికిని దేవునికి దాసులుగా నుండనేరరు.* మత్తయి 6:24. కాబట్టి డబ్బును ప్రేమించే వారు తమ డబ్బునిచ్చినంత మాత్రాన దేవున్ని ప్రేమించినట్లా? తమ ఘనతకోసమో, దేవుని దగ్గర్నుండి ఆశీర్వాదాలు ఆశించో లేదా దేవుడు ఏ కీడు రానీయకుండా వుండటం కోసమో ఇస్తున్నారనేగా అను కోవాల్సివస్తుంది.

| పుట్టుక |
|---|
| **దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను (ఆది.2:7)** |

దేవుడు మనుష్యుల నుండి డబ్బును ఆశిస్తాడా? మరి దశమభాగము, కృతజ్ఞతార్పణల విషయం ఏంటి అనే అనుమానం వస్తుంది కదా! ఎవరైనా ఒక వ్యక్తి తాను కష్టపడి పనిచేసినందువల్ల వచ్చే డబ్బు తన ఒక్కడి కోసమే కాకుండా ఆ డబ్బుని తన కుటుంబంలోని ప్రతి ఒక్కరికోసం ఖర్చుచేస్తాడు. మరి దేవుని ప్రేమించే వారు, దేవుడు తన కుటుంబంలో ఉన్నాడనుకుంటే, దేవుడు తన సృష్టికర్త అని భావిస్తే తను సంపాదించే ప్రతి పైసాలో కొంత భాగం దేవుని కోసం ఖర్చు చేస్తాడు. కాబట్టి మనం దేవున్న ప్రేమిస్తున్నామో లేదో మన కష్టార్జితంలోనుండి దేవునికి భాగము ఇవ్వటంలోనే తెలుస్తుంది. దేవుడు ఆరోగ్యం ఇస్తేనే కదా ఒక మనిషి డబ్బు సంపాదించుకో గలుగుతున్నాడు. మరి మనకి ఆరోగ్యమిచ్చిన దేవునికి కృతజ్ఞతగా మన కష్టార్జితాన్ని దేవునికి వంచాలి. కాబట్టి మనిషి దేవున్ని ప్రేమిస్తున్నాడో లేదో తెలుసుకోడానికి ఈ దశమభాగ పరీక్ష. అంతే తప్ప ఈ లోకంలో సర్వసంపదలు సృష్టించిన దేవునికి ఆ డబ్బుతో అవసరం ఏమీ ఉండదు.

క్రైస్తవులు, అనగా క్రీస్తుని నమ్మిన వారు డబ్బుని ప్రేమిస్తే దేవున్ని (క్రీస్తుని) ప్రేమించి నట్లేనా, అలా డబ్బుని ప్రేమిస్తూ క్రైస్తవులని చెప్పుకొనేవారు దేవున్ని ప్రేమించగలరా? వారికి వారు కోరుకునే పరలోక రాజ్యం ప్రాప్తిస్తుందా? దేవున్ని మనం ఎరగటం కాదు, దేవుడు మనల్ని ఎరగాలి. *"ప్రభువా, ప్రభువా మేము నీ నామమున ప్రవచింప లేదా? నీ నామమున దయ్యములను వెళ్ళగొట్టలేదా? నీ నామమున అనేకమైన అద్భుతములు చేయలేదా? అని చెప్పుదురు. అప్పుడు నేను - నేను మిమ్మును ఎన్నడును ఎరుగను; అక్రమము చేయువార లారా, నా యొద్ద నుండి పొండని వారితో చెప్పుదును"* మత్తయి 7:22,23. కాబట్టి దేవుని నామమున గొప్ప కార్యములు చేసే వారినే దేవుడు ఎరుగక పోతే, వారిని అనుసరించే క్రైస్తవులను మరి దేవుడు ఎరుగునా? ఎవరైతే దేవున్ని ప్రేమిస్తారో వారినందరిని

దేవుడు ఎరుగుతాడు. డబ్బుని ప్రేమించే వారు దేవున్ని ప్రేమించలేరు కాబట్టి దేవుడు వారిని ఎరుగడు. *"ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడుకాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును"* మత్తయి 7:21.

ఒక యౌవనస్థుడైన ధనవంతుడు యేసుక్రీస్తు దగ్గరకు వచ్చి 'బోధకుడా, నిత్యజీవము పొందుటకు నేను ఏ మంచికార్యము చేయవలెనని ఆయనను అడిగెను. అందు కాయన -మంచి కార్యములను గూర్చి నన్నెందుకు అడుగు చున్నావు? మంచివాడొక్కడే. నీవు జీవములో ప్రవేశింప గోరిన యెడల ఆజ్ఞలను గైకొనుమని చెప్పెను. అతడు -ఏ ఆజ్ఞలని ఆయనను అడుగగా యేసు-నరహత్య చేయవద్దు, వ్యభిచరింప వద్దు, దొంగిలవద్దు, అబద్ధసాక్ష్యము పలుక వద్దు, తల్లిదండ్రులను సన్మానింపుము, నిన్ను వలె నీ పొరుగువానిని పే్రమింపవలెను అను నవియే అని చెప్పెను. అందుకు ఆ యౌవనుడు -ఇవన్నియు అనుసరించుచునే యున్నాను; ఇకను నాకు కొదువ యేమని ఆయనను అడిగెను. అందుకు యేసు-నీవు పరిపూర్ణుడ వగుటకు కోరిన యెడల, పోయి నీ ఆస్తిని అమ్మి బీదల కిమ్ము, అప్పుడు పరలోకమందు నీకు ధనము కలుగును; నీవు వచ్చి నన్ను వెంబడించుమని అతనితో చెప్పెను. అయితే ఆ యౌవనుడు మిగుల ఆస్తిగలవాడు గనుక ఆ మాట విని వ్యసనపడుచు వెళ్ళిపోయెను. మత్తయి 19:16-22.

**చా వు**

**ఏలయనగా నేల నుండి నీవు తీయబడితివి; నీవు మన్నే గనుక తిరిగి మన్నైపోదువని చెప్పెను (ఆది.3:18)**

యేసు తన శిష్యులను చూచి-ధనవంతుడు పరలోక రాజ్యములో ప్రవేశించుట దుర్లభమని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. ఇదిగాక ధనవంతుడు పరలోకరాజ్యములో ప్రవేశించుట కంటే సూదిబెజ్జములో ఒంటె దూరుట సులభమని మీతో చెప్పుచున్నాననెను. శిష్యులు ఈ మాట విని మిక్కిలి ఆశ్చర్యపడి -ఆలాగైతే ఎవడు రక్షణ పొంద గలడని అడుగగా యేసు వారిని చూచి -ఇది మనుష్యులకు అసాధ్యమేగాని దేవునికి సమస్తమును సాధ్యమని చెప్పెను. మత్తయి 19:23-26.

కాబట్టి పై సందర్భాన్నిబట్టి చూస్తే మనుష్యులు చేసే నీతికార్యములనుబట్టికాక హృదయపూర్వకముగా దేవుని ప్రేమించుటనుబట్టియే రక్షణ ప్రాప్తిస్తుంది. ధనమును ప్రేమించే హృదయంతో దేవున్ని వెంబడించటం అసాధ్యం. ఆలాగైతే ఎవడు రక్షణ పొందగలడని శిష్యులు ఆశ్చర్యం వెలిబుచ్చడంలో అర్థం, ఆలాగైతే ప్రపంచంలో ఎవడు రక్షణ పొందగలడు, ప్రపంచమంతా అలాగే వుంది కదా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అప్పుడు యేసు ప్రభువు -ఇది మనుష్యులకు అసాధ్యమే కాని దేవునికి సమస్తమును సాధ్యము అని చెప్పాడు. యేసుప్రభువు కాలంలోనే అంటే ఇప్పుడున్న విలాసవంతమైన జీవితం లేని కాలంలోనే అలాంటి పరిస్థితి వుంటే, ఇప్పటి కాలంలో అది ఇంకెంత అసాధ్యము. అయితే నేటి కాలంలో మనుష్యులు తమంతట తాముగా డబ్బు నుండి తప్పించుకోవడం అసాధ్యమే కాని దేవున్ని ఆశ్రయించిన వారికి ఆయన తప్పక ధనాపేక్ష నుండి విడుదల దయచేస్తాడు. కాబట్టి ఈ లోకంలో మనిషి జీవించడానికి డబ్బుని ఆశ్రయించకుండా దేవున్ని ఆశ్రయించినట్లయితే, దేవుడు ఈ లోకంలో జీవించడానికి తగిన ధైర్యాన్నిచ్చి, వారి అవసరా లన్నీ తీర్చగల సమర్థుడు.

ఈ లోకంలో పుట్టిన తర్వాత ఒక మనిషి ఈ భూమ్మీద బ్రతికే కాలం దేవుడు నిర్ణయించిన ప్రకారం 70 లేదా 80 సం॥లు. ప్రతి మనిషీ తన జీవితకాలం మొత్తంలో ఎన్నో స్టేజీలు దాటుకుంటూ వెళ్ళాలి. బాల్యం, యవ్వనం, కౌమార్యము, వృద్ధాప్యం. ప్రతి మనిషి ఈ స్టేజీలన్నీ దాటుకుంటూ వెళ్ళాల్సిందే. ఏ స్టేజీ నుండి మనం దేవునితో జీవిస్తామో అక్కడ నుండి మన జీవితం నల్లేరు మీద నడకలా సాగిపోతుంది. ఎలాంటి బాదరబందీలు లేని జీవితం దేవుని వలన మాత్రమే వస్తుంది. మొదటగా మనం మన జీవితాల్లో దేవునికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామో దాని ప్రకారమే మన జీవితం సాగిపోతుంది. అంటే చాలామంది దేవునికి తమ జీవితాల్లో ఇచ్చే చోటు చాలా తక్కువ.

**(ఇంకావుంది)**

# బైబిలు కథలు - బాబేలు గోపురం

పిల్లలూ బాగున్నారా? దసరా సెలవులను బాగా ఎంజాయ్ చేశారా? ఈ సెలవల్లో కూడా మీరు మీ బంధువుల ఇళ్ళకి వెళ్ళారా? సరే, మీరు ఎక్కడ వున్నా, ప్రతిరోజూ బైబిల్ చదవటం, ప్రార్ధన చేసుకోవడం మర్చిపోకూడదు. అన్నట్లు మీ స్కూల్లో పాఠాలు చెప్తారు కదా! వాటిలో తెలుగు, ఇంగ్లీషు, హిందీ, సంస్కృతము చెప్తారు. వీటిని భాషలు అని అంటాము కదా! మరి జలప్రళయము తర్వాత నోవహు కుటుంబం మాత్రమే రక్షించబడింది. అంటే ఎనిమిది మంది కదా వాళ్ళు. మరి వాళ్ళంతా ఒకే భాష కదా మాట్లాడారు. అయితే ఈ తెలుగు, ఇంగ్లీషు, హిందీ, సంస్కృతము, ఇంకా ప్రపంచంలో సుమారు 6,500 భాషలు మాట్లాడే వారు ఉన్నట్లు అంచనా. ఈ భాషలన్నీ ఎక్కడ నుండి వచ్చాయి, ఎప్పటి నుండి వచ్చాయి. మీకేమైనా తెలుసా? తెలియకపోతే ఈ నెలలో మనం బాబేలు గోపురం గురించి తెలుసుకోబోతున్నాము కదా! తర్వాత మీకు అర్ధమవుతుంది ఎలా ఈ భాషలు వచ్చాయో.




నోవహు జలప్రళయము తర్వాత నోవహు కుటుంబ మును దేవుడు 'మీరు ఫలించి అభివృద్ధి పొంది భూమిని నింపుడి' అని ఆశీర్వదించాడు. అంటే పిల్లల్ని కని మనుష్యులతో భూమిని నింపండి అని చెప్పాడు. నోవహు కుమారులైన షేము, హాము, యాపెతుకు పుట్టిన కుమారులు, వారి కుమారులు, వారి కుమారులు ఇలా అనేక తరముల వారు భూమి మీద అభివృద్ధి చెందుతూ ఉన్నారు. వారంతా ఒకచోట ఉండకుండా భూమి మీద సంచరిస్తూ ఉన్నారు. అప్పుడు భూమి మీద నోవహు సంతానము వలన వచ్చిన వారు తప్ప ఇంకేవరూ లేరు.

నోవహు కుటుంబం మాట్లాడే భాషే అందరూ మాట్లాడే వారు. అంటే అప్పట్లో భూమి మీద ఒకే భాష, ఒకే పలుకు ఉండేదన్న మాట. అప్పుడు వారంతా భూమి మీద సంచారము చేస్తూ తూర్పు వైపుగా ప్రయాణం చేస్తున్నప్పుడు షీనారు దేశములో వారికి ఒక పెద్ద మైదానము కనబడింది. అంత పెద్ద మైదానము చూసేసరికి వారికి ఒక ఆలోచన వచ్చింది. ఆ మైదానములో వారు పెద్ద పట్టణం మరియు ఒక పెద్ద గోపురం, ఆకాశాన్నంటేటంతగా కట్టాలి అని అనుకున్నారు. వాళ్ళంతా ఒకే భాష మాట్లాడే వాళ్ళు కాబట్టి, ఆ విషయం వెంటనే అందరికి తెలిసి పోయి, గోపురం కట్టడానికి సిద్ధమయ్యారు. గోపురం అంటే ఒక పెద్ద అపార్టుమెంటులాంటి ది. వాళ్ళు అలా కట్టుకుంటూ కట్టుకుంటూ ఆకాశంలోకి వెళ్ళాలి అన్నది వారి ఆలోచన. అందుకోసం వాళ్ళు రాళ్ళకు బదులుగా ఇటుకలు అడుసుకు బదులుగా మట్టికీలు తయారు చేసుకొని గోపురం కట్టడం మొదలుపెట్టారు.

అప్పుడు దేవుడు మనుష్యులు కట్టిన పట్టణమును మరియు గోపురమును చూడటానికి దిగి వచ్చాడు. మనుష్యులు భూమి అంతా విస్తరించాలని దేవుడు వారిని ఆశీర్వదించాడు 'మీరు ఫలించి అభివృద్ధి పొంది భూమిని నింపుడి' అని. అయితే సాతాను మనుష్యులను ప్రేరేపించి దేవుని చిత్తానికి వ్యతిరేకంగా భూమి మీద విస్తరించకుండా ఆకాశంలోకి వెళ్ళాలని గోపురం కట్టటానికి పూనుకున్నారు. మనుష్యుల అమాయకత్వము వలన వారు చనిపోతారని దేవుడికే కదా తెలిసేది. అంతేకాక, ఆకాశంలోకి కొంత

దూరం వెళ్తే అక్కడ ఆక్సిజన్ అందక చనిపోతారని దేవుడికి తెలుసు కాబట్టి దేవుడు దిగివచ్చాడు. అప్పుడు దేవుడు అనుకున్నాడు వీళ్ళంతా ఒకే భాష మాట్లాడుతున్నారు కాబట్టే కదా, వీళ్ళు ఏమనుకుంటే అది చేసేస్తున్నారు అని అనుకొని అక్కడ వారి భాషలను తారుమారు చేశాడు. అప్పుడు వాళ్ళు రకరకాల భాషలు మాట్లాడటం మొదలుపెట్టారు. వాళ్ళలో ఒకరు చెప్పింది ఇంకొకరికి అర్థంకాక ఆ పట్టణము మరియు గోపురము కట్టటం మానుకున్నారు. అక్కడ వారి భాషలు తారుమరు అయ్యి ఒకరు చెప్పేది ఒకరికి అర్థంకాక పోవడం వలన వారు ఆ చోటుకి 'బాబెలు' అని పేరు పెట్టారు. 'బాబెలు' అనగా 'తారుమారు' అని అర్థము. ప్రపంచంలోని అన్ని భాషలు అప్పుడే, షీనారు దేశములోని మైదానములో పుట్టాయి. అప్పుడు వివిధ భాషలు మాట్లాడే వారు గుంపులుగా విడిపోయి తలా ఒక దిక్కుకి వెళ్ళి పోయారు. ఆ విధంగా దేవుడు అనుకున్నట్లు మనుష్యులు భూమి మీద విస్తరించటానికి వారందరూ భూమి అంతటా చెదరిపోయేలా చేశాడు.

చూశారా పిల్లలూ, మనుష్యులు దేవుని మాట విననీయ కుండా సాతాను ఎప్పుడూ ఆటంకాలు కలుగ జేస్తూనే ఉంటుంది. దేవుడు మనుష్యులను భూమి మీద విస్తరించ మని ఆశీర్వదిస్తే, సాతాను అందుకు విరుద్ధంగా విస్తరించ నీయకుండా ఆకాశంలోకి ఎక్కిపోవునట్లు వారిని ప్రేరేపించింది. కాబట్టి మనం తప్పు చేస్తున్నామంటే, అది దేవుని చిత్తానికి వ్యతిరేకంగా సాతాను మనల్ని ప్రేరేపిస్తూ ఉందని అర్థం చేసుకోవాలి. తల్లిదండ్రులకి లోబడి ఉండ మని దేవుడు చెప్తే, అందుకు విరుద్ధంగా తల్లిదండ్రులను ఎదిరించేలా సాతాను మిమ్మల్ని ప్రేరేపిస్తుంది. అప్పుడు మీరు తల్లిదండ్రుల ప్రేమకు దూరం అవుతారు. దేవునికి అవిధేయతగా ఉంటే, సాతాను మిమ్ములను ప్రేరేపించి మీకు చెడ్డపేరు వచ్చేలా చేస్తుంది. అప్పుడు అందరూ మిమ్ములను అసహ్యించుకుంటారు. మీరు మంచిపిల్లలుగా ఉంటే దేవుడు మీకు ఎన్నో ఆశీర్వాదాలు ఇస్తారు. మీరు గొప్పగా ఉండేలా దేవుడు మీకు సహాయం చేస్తాడు. దేవుడు మిమ్మును దీవించును గాక!

# మారుమనస్సు (చిన్నకథ)


ఇద్దరు స్నేహితులు బార్‌లో కూర్చుని మద్యము త్రాగు తున్నారు. వారు దేనిగురించో వాదించుకుంటున్నారు. అంతలో వారిలో ఒకడు లేచి ఇంకొకడిని చితకబాద సాగాడు. అలా కొంతసేపు చితకబాదటంలో అతని స్నేహితుడు చనిపోతాడు. కొట్టిన వాడి చొక్కా అంతా రక్తపు మరకలు అవుతాయి. అప్పుడు అతడు అక్కడ నుండి పరుగెత్తడం ప్రారంభిస్తాడు. ఇదంతా చూచిన అక్కడి వాళ్ళు అతన్ని పట్టుకోవడానికి అతని వెనకాల పరుగెత్తుతుంటారు.

హత్య చేసిన అతను ఒక ఇంట్లోకి దూరతాడు. అది ఒక క్రైస్తవుని ఇల్లు. అతను ఒక్కడే ఉంటున్నాడు. ఆ ఇంట్లోకి దూరిన ఆ హంతకుడు ఆ క్రైస్తవుడిని ప్రాధేయపడతాడు 'అనుకోకుండా నేను ఒక వ్యక్తిని చంపాను, అది చూచిన వారు నన్ను తరుము కుంటూ వస్తున్నారు. దయచేసి నన్ను దాచిపెట్టండి' అని. అప్పుడు ఆ క్రైస్తవుడు 'నేను ఉంటున్న ఇల్లు ఒకే గది, నేను నిన్ను ఎక్కడ దాచిపెట్టగలను' అని అంటాడు. అప్పుడు ఆ హంతకుడు 'దయచేసి ఏదో ఒకటి చెయ్యండి, వాళ్ళు వస్తే నన్ను చంపేస్తారు' అని ప్రాధేయపడతాడు. అప్పుడు ఆ క్రైస్తవుడు కొంతసేపు ఆలోచించి 'సరే, అయితే ముందు నువ్వు వేసుకున్న ఆ రక్తపు మరకలు ఉన్న చొక్క విప్పి నాకివ్వు' అని అడుగుతాడు. అప్పుడు ఆ హంతకుడు తన చొక్కా విప్పి ఆ క్రైస్తవునికి ఇవ్వగానే క్రైస్తవుడు తన చొక్కా విప్పదీసి హంతకునికి ఇస్తూ 'ఈ చొక్కా ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచు' అని చెప్పి రక్తపు మరకలు ఉన్న చొక్కా తను వేసుకుంటాడు. అంతలో తరుముతున్న వాళ్ళు ఆ ఇంట్లోకి వచ్చి రక్తపు మరకలు వున్న చొక్కా వేసుకున్న ఆ క్రైస్తవుడే హంతకుడు అనుకొని అతని చితకబాది పోలీసులకి అప్పజెప్తారు. కోర్టులో నేరం రుజువయ్యి అతనికి ఉరి శిక్ష పడుతుంది. క్రైస్తవుని ఇంట్లో సురక్షితంగా ఉన్న హంతకుడు పశ్చాత్తాపపడుతూ పరుగెత్తుకుంటూ కోర్టుకి వెళ్ళి జడ్జీతో చెప్పాడు. 'అయ్యా, అసలు హంతకుడిని నేనే, అతను నిరపరాధి' అని. అప్పుడు జడ్జీ సమయం మించిపోయింది. అతను ఉరి తీయబడ్డాడు అని చెప్తాడు. అప్పుడు ఆ హంతకుడు అతను ఉరి తీయబడిన చోటికి వెళ్ళినప్పుడు ఆ క్రైస్తవుడు ఉరి కంబానికి వ్రేలాడుతూ కనిపిస్తాడు. అతను దగ్గరకు వెళ్ళి మోకాళ్ళ మీద ఉండి కన్నీళ్ళు కారుస్తూ 'నేను చేసిన తప్పుకి నువు శిక్ష అనుభవించావా?' అని మనసులో అనుకున్నాడు. అప్పుడు ఆ క్రైస్తవుడు చివరిసారిగా చెప్పిన 'నా చొక్కా పరిశుభ్రంగా ఉంచు' అన్న మాటలు గుర్తుకొచ్చాయి. అప్పుడే అతను మారుమనస్సు పొంది క్రైస్తవుడిగా మారిపోయాడు.

**యేసుక్రీస్తు మన పాపముల నిమిత్తము సిలువలో మరణించాడు. మరి మనం మారుమనస్సు పొందామా?**

## ఈ నెల ప్రశ్న - అక్టోబర్-2016

**గొల్యాతు సహోదరుని పేరు ఏమిటి?**
(1దినవృత్తాంతములు)





మీ జవాబు ఈ నెల 30వ తేదీలోపు 9440217726 నంబరుకి ఎస్.యం.ఎస్ ద్వారా పంపించాలి. సరైన సమాధానం పంపిన వారిలో 'లక్కిడిప్' ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి రూ.125/- లు విలువ చేసే **'ఆంధ్రక్రైస్తవ ఉజ్జీవ కీర్తనలు'** అనే 1000 పాటలు ఉన్న పుస్తకము బహుమతిగా ఇవ్వబడుతుంది. అయితే ఈ అవకాశం **'చందాదారులకు మాత్రమే'**. అనగా చందా చెల్లించిన వారు మాత్రమే ఈ ప్రశ్నకు జవాబు పంపించాలి. 30వ తేది లోపు చందా చెల్లించే వారు కూడా పాల్గొనవచ్చును.

## చందాదారుల వివరాలు

| | | |
|---|---|---|
| పాస్టరు కె. సామ్యేల్ రాజేంద్రగారు | రూ. | 5,000 |
| పాస్టరు విజయచంద్రగారు, బెంగుళూరు | రూ. | 3,000 |
| శ్రీ కె. జోనాతానుగారు, చెన్నై | రూ. | 2,000 |
| పాస్టర్ దానియేల్‌గారు, ఒంగోలు | రూ. | 1,500 |
| శ్రీ కె. చక్రవర్తి, హైదరాబాద్ | రూ | 1,000 |
| శ్రీ కె. హనోక్, న్యూఢిల్లీ | రూ. | 1,000 |
| శ్రీమతి రత్నకుమారి, కరీంనగర్ | రూ. | 500 |
| శ్రీ పరుసు వెంకటరావు, బెంగుళూరు | రూ. | 500 |
| కుమారి లీనా, బెంగుళూరు | రూ. | 500 |
| శ్రీమతి విక్టోరియా, మార్కాపురం | రూ. | 500 |
| శ్రీమతి మార్తామనోరమ, హైదరాబాద్ | రూ. | 500 |
| శ్రీమతి రూత్ ఇవాంజలిన్, ఒంగోలు | రూ. | 500 |
| శ్రీమతి అరుణమ్మ, ఒంగోలు | రూ. | 500 |
| శ్రీమతి సువర్ణరత్నకుమారి, విజయవాడ | రూ. | 300 |
| పాస్టర్ కె. జాన్‌మార్క్, క్రొత్తపట్నం | రూ. | 200 |
| శ్రీ కొట్టె కమల్, శ్రీరాంపురం, ఆదిలాబాద్ | రూ. | 150 |
| పాస్టర్ జె. జయరాములు, కాకినాడ | రూ. | 150 |
| పాస్టర్ ప్రకాశం, నారాయణపురం, వరంగల్‌జిల్లా | రూ. | 150 |

చందాకట్టిన వారిలో ఎవరి పేరైనా లేనిచో దయచేసి 9440217726 నంబరుకి ఫోన్ చేయమని కోరుచున్నాము

## అత్యంత ఖరీదైన బైబిల్



క్రైస్తవులకు పవిత్రమైన పరిశుద్ధమైన గ్రంథము బైబిలు. ఈ గ్రంథమును చాలా చోట్ల ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. సాధారణంగా ఎవరైనా ఒక గ్రంథాన్ని కొనలని మనసులో ఉన్నా దాని కోసం వందలాది రూపాయలు ఖర్చు చేయాలంటే కొద్దిగా ఆలోచిస్తారు. కాని పరిశుద్ధ గ్రంథాన్ని మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ 135 కోట్ల రూపాయలు చెల్లించి కొన్నారంటే ఆశ్చర్యం కలగక మానదు. వివరాలను పరిశీలిద్దాం.

ప్రింటింగ్ మిషన్‌ను కనుగొన్న తరువాత మొదటి సారిగా ముద్రించిన గ్రంథం బైబిల్. ప్రపంచంలోనే కాదు మన దేశంలో కూడా బైబిల్‌నే మొదట ముద్రించారు. ప్రింటింగ్ ప్రెస్ కనుగొన్న జొహాన్స్ గూటెన్‌బర్గ్ మొదటగా 180 కాపీలను ముద్రించాడు. దీనికిగాను మూడు సంవత్సరాల వ్యవధి పట్టింది. అంటే క్రీ.శ. 1453 నుంచి క్రీ.శ.1456 వరకు అన్నమాట. బైబిల్‌ని మొట్టమొదట ముద్రణ చేసిన 180 కాపీలలో 50 కాపీలే లభ్యమయ్యాయి. గూటెన్‌బర్గ్ ప్రింట్ చేసిన మొదటి మూడు మాస్టర్ కాపీలలో ఒకదానిని 'లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్' రెండు కోట్ల రూపాయలను చెల్లించి సొంతం చేసుకుంది.

ఆ తర్వాత మిగిలిన రెండు మాస్టర్ కాపీలలో ఒక దానిని 1994లో జరిగిన వేలంపాటలో బిల్‌గేట్స్ 135 కోట్ల రూపాయలు చెల్లించి దక్కించుకున్నాడు. మూడవ మాస్టర్ కాపీ న్యూయార్క్ సిటీలో అమ్మకానికి సిద్ధంగా ఉంది. ఎవరైనా దానిని దక్కించుకోవాలంటే 200 కోట్లకు పై మాట వెచ్చించాల్సి వస్తుంది.

**కొసమెరుపు:** చాలామంది తమ ఆరోగ్యం కొరకు ఎన్ని వేల రూపాయలైనా ఖర్చు చేయడానికి వెనుకాడరు కాని, జీవితాలను మార్చివేసే బైబిలును 200 రూపాయలు ఖర్చు పెట్టి కొనడానికి ఏ మాత్రం సిద్ధంగా ఉండరు. ఎవరైనా ఉచితంగా ఇస్తారేమో అని వేచి చూస్తుంటారు.

## <u>బైబిల్ క్విజ్ - 22 జవాబులు</u>

**1.** రెజీను (2రాజు. 16:6) **2.** మూడు సంవత్సరములు (17:5) **3.** సన్హెరీబు (18:13) **4.** తిర్హాకా (19:9) **5.** 15 సంవత్సరాలు (20:6) **6.** ఉజ్జా యొక్క తోటలో తన నగరు దగ్గర (21:18) **7.** యెదీదా (22:1) **8.** 18 సంవత్సరమున (23:23) **9.** నెహుష్తా (24:8) **10.** ఎవీల్మెరోదకు (25:27) **11.** మెహేతబేలు (1దినవృత్తాంత. 1:50) **12.** ఏయిఫా (2:46) **13.** ఆరుగురు (3:22) **14.** బిత్యా (4:18) **15.** మిఖాయేలు (5:14) **16.** అబీషువ (6:50) **17.** 26,000 (7:40) **18.** విలువిద్యయందు (8:40) **19.** మెరీబ్బయలు (9:40) **20.** దాగోను గుడిలో (10:10).

## ముఖ్య గమనిక:

బైబిల్ క్విజ్ జవాబులు పంపించేవారు

బుక్ అడ్రస్ లేబుల్ మీద ఉన్న

**సీరియల్ నంబరు**

మరియు మీ

**ఫోన్ (మొబైల్) నంబరు**


తప్పని సరిగా వ్రాయాలి. లేనిచో

జవాబులు అంగీకరించబడవు.

### బైబిల్ క్విజ్-22 ప్రశ్నలకు జవాబులు వ్రాసిన వారు :

**వి.బాలకోటయ్య,** యద్ధనపూడి, ప్రకాశంజిల్లా
**కె.రత్నరాజు,** నరసాపూర్, ప.గో.జిల్లా
**బి.ప్రసన్నకుమారి,** ధవళేశ్వరం, తూ.గో.జిల్లా
**కె.ప్రవీణ్‌కుమార్,** హన్మకొండ, వరంగల్ జిల్లా
**కె.కమల్,** శ్రీరాంపూర్, మంచిర్యాల(మం) ఆదిలాబాద్ జిల్లా
**కె.మేరిబ్యూలా,** చింతలపూడి, ప్రత్తిపాడు(మం) తూ.గో.జిల్లా
**కె.సురేంద్ర,** టి.ఆర్.నగర్, డోన్, కర్నూలు జిల్లా
**శ్రీమతి వి.శారాభాయి,** భీమవరం, ప.గో.జిల్లా
**పి.చిన్నారావు,** విజయవాడ, కృష్ణా జిల్లా
**టి. చిన్నా,** గొల్లపాలెం, మల్కీపురం (మం), తూ.గో.జిల్లా
**కె.స్టీఫెన్,** తెల్లపాడు, కలిగిరి (మం), నెల్లూరు జిల్లా
**కె.టోని,** ప్రకాశరావుపాలెం, నల్లజర్ల (మం), ప.గో.జిల్లా
**పి.ఎస్తేర్‌రాణి,** శంకవరప్పాడు, అద్దంకి (మం), ప్రకాశంజిల్లా
**కె.వి.డేనియల్,** రాజమండ్రి, తూ.గో.జిల్లా
**జె.బ్యూలారాణి,** బాపట్ల, గుంటూరుజిల్లా
**కె.వాణికుమారి,** చీరాల, ప్రకాశంజిల్లా
**వై.కృపాకోమల,** దర్శి, ప్రకాశంజిల్లా
**జె.లక్ష్మీనరసింహ,** కొత్తపల్లి, కర్నూలుజిల్లా
**ఆర్.జయమ్మలాబాను,** గుంతకల్, అనంతపురంజిల్లా
**పాస్టర్ ఎస్.అబ్రాహాం,** చిలకలపూడి, మచిలీపట్నం, కృష్ణాజిల్లా
**డి.మనిందర్,** హన్మకొండ, వరంగల్‌జిల్లా
**జి.రోజమ్మ,** ప్రసాద్‌నగర్, వేటపాలెం, ప్రకాశంజిల్లా
**శ్రీమతి వై.కె.సత్యసారధి,** అమీర్‌పేట్, హైదరాబాద్
**కె.డేవిడ్‌రాజు,** తిరువూరు, కృష్ణాజిల్లా
**కె.శ్రీనివాసుదొర,** సి.టి.నెం.9381, సెంట్రల్‌జైల్, రాజమండ్రి
**ఎన్.మేరి,** పొదిలి, ప్రకాశంజిల్లా
**పాస్టర్ టి.విజయపాల్,** పి.వి.పాలెం, నర్సరావుపేట, గుంటూరుజిల్లా
**యం.శ్రీకర్‌కుమార్,** జుజ్జూరు, వీరులపాడు(మం), కృష్ణాజిల్లా
**ఎన్.శ్రీనివాస్,** కొత్తపల్లి, రొంపిచెర్ల(మం), గుంటూరుజిల్లా
**బి.ఎస్తేర్‌రాణి,** గోగులమూడి, పెదనందిపాడు(మం), గుంటూరుజిల్లా

బైబిల్ క్విజ్ జవాబులు పంపించే వారు అడ్రస్ లేబుల్ మీద ఉన్న **సీరియల్ నంబర్** తప్పని సరిగా వేయాలి.





# అక్షరయజ్ఞం

## బైబిల్ క్విజ్ - 23

1దినవృత్తాంతములు11 నుండి 2దినవృత్తాంతములు 1 వరకు



శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్

1. దావీదు పరాక్రమశాలుల పట్టీలో ఎంతమంది ఉన్నారు? (1దినవృత్తాంతములు 11 అధ్యాయము)
2. సౌలు రాజ్యమును దావీదు తట్టు త్రిప్పవలెనని నొద్దకు వచ్చిన వారిలో దానీయులు ఎంతమంది? (12వ అ.)
3. దేవుని మందసమును ఒక క్రొత్త బండి మీద ఎక్కించి ఎవరి ఇంటి నుండి తీసికొని వచ్చిరి? (13వ అ.)
4. ఫిలిష్తీయులు దావీదు మీదకు వచ్చినప్పుడు దావీదు వారిని ఎక్కడ హతము చేసెను? (14వ అ.)
5. మందసము మోయుటయందు గట్టివాడైన లేవీయుల అధిపతి ఎవరు? (15వ అ.)
6. మందసము ముందర నిత్యమును అనుదిన సేవ జరుపుటకై దావీదు ఎవరిని నియమించెను? (16వ అ.)
7. తాను దేవునికి మందిరము కట్టించాలని దావీదు ఏ ప్రవక్తతో చెప్పెను? (17వ అ.)
8. అబీషై ఎంతమంది ఎదోమీయులను హతము చేసెను? (18వ అ.)
9. నాహాషు కుమారుని పేరేమిటి? (19వ అ.)
10. గొల్యాతు సహోదరుని పేరు ఏమిటి? (20వ అ.)
11. ఒర్నాను కళ్లమును దావీదు ఎంతకు కొనెను? (21వ)
12. మందిరము కొరకు ఎంత వెండిని సమకూర్చెను? (22వ)
13. కవిలెలో చేర్చబడిన వారి సంఖ్య ఎంత? (23వ అ.)
14. లేవీయులలో శాస్త్రిగా ఉన్నది ఎవరు? (24వ అ.)
15. చీట్లు వేసినప్పుడు గిద్దల్తీ పేరట పడిన చీటి ఎన్నవది? (25వ అ.)
16. వివేకముగల ఆలోచనకర్త ఎవరు? (26వ అ.)
17. రాజు యొక్క సేనకు అధిపతిగా నియమింపబడినది ఎవరు? (27వ అ.)
18. "ధైర్యము తెచ్చుకొని యీ పనికి పూనుకొనుము" అని దావీదు ఎవరితో చెప్పెను? (28వ అ.)
19. సొలొమోనుకు పట్టాభిషేకము చేసినప్పుడు యాజకునిగా ఎవరిని అభిషేకించెను? (29వ అ.)
20. ఐగుప్తులో కొన్న గుఱ్ఱము ఖరీదు ఎంత? (2దినవృత్తాంతములు 1)

### గమనిక

మీ జవాబులను **SMS/Whatsapp/E-mail** ద్వారా కూడా పంప వచ్చును. **SMS/Whatsapp** ద్వారా పంపేవారు మీ పేరు, అడ్రస్ లేబుల్ మీద ఉన్న సీరియల్ నంబరుతో బైబిల్‌క్విజ్-22 అని టైపు చేసి, ప్రశ్న నంబరు, జవాబు, బైబిల్ రెఫెరెన్సుతో జవాబులన్నీ ఒకే మేసేజ్‌లో 9440217726 నంబరుకు పంపాలి. **E-mail** ద్వారా పంపేవారు సబ్జెక్ట్ దగ్గర మీ పేరు, అడ్రస్ లేబుల్ మీద ఉన్న సీరియల్ నంబరు, బైబిల్ క్విజ్-22 అని టైపు చేసి ప్రశ్న నంబరు, జవాబు, బైబిల్ రెఫెరెన్సుతో 20 ప్రశ్నలకు జవాబులన్నీ ఒకే మెయిల్‌లో holiness.ierf@gmail.comకి పంపాలి. పోస్టుకార్డు లేదా ఎన్వలప్ కవరు ద్వారా (తెల్లపేపరు మీద, అడ్రస్ లేబుల్ మీద ఉన్న సీరియల్ నంబరు, మీ ఫోన్ నంబరు వ్రాసి, జవాబులు) పంపదలచిన వారు ఈ నెల 30వ తేదిలోపు **పరిశుద్ధత-బైబిల్ క్విజ్, పోస్ట్‌బాక్స్ నెం.28, ఒంగోలు-523001** అడ్రసుకు పంపగలరు.

అన్ని ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాసిన వారికి

**"నా చిత్తానుసారుడు"**

**(రాజైన దావీదు జీవితచరిత్ర)**

అను 110/- రూపాయల క్రైస్తవ నవల లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి ఒకరికి ఉచితంగా పంపబడును